తెలంగాణ

TELANGANA MUCHATLU

TELTEL/2023/88710

తెలుగు ముచ్చట్లు

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

వరంగల్ | ఆదివారం - 13- సెప్టెంబర్ 2026 | సంపుటి : 4 | సంచిక : 101 | పేజీలు - 8 | వెల : రూ 7 | www.telanganamuchatlu.in

గణేశ్ ఉత్సవాలపై సీఎం సమీక్ష

- మున్సిపల్, పోలీసు శాఖల సమన్వయంపై ఆదేశాలు
- పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులు, నియంత్రణ కేంద్రం ఏర్పాటు
- శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు చేపట్టాలని సూచన
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (తెలంగాణ ముచ్చట్లు)

హైదరాబాద్ మహానగరంలో గణేశ్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా, విజయవంతంగా జరిగేలా మున్సిపల్, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గణేశ్ ఉత్సవాలు ముగిసే వరకు నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. ఉత్సవాల సమన్వయం, పర్యవేక్షణ కోసం ప్రత్యేక అధికారులను నియమించాలని అధికారులకు స్పష్టం చేశారు. శాసనసభ ఆవరణలోని మండలి సమావేశ మందిరంలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో గణేశ్ ఉత్సవాల ఏర్పాట్లపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు.

మిగతా 2లో

ప్రతిపక్షాలు అహంకారం వీడాలి : రేవంత్

శాసనసభలో ప్రతిపక్షాలపై ముఖ్యమంత్రి విమర్శలు

అధికారం పోయినా అహంకారం తగ్గలేదని వ్యాఖ్య

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (తెలంగాణ ముచ్చట్లు)

శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపక్షాలను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. అధికారం కోల్పోయినప్పటికీ అహంకారం మాత్రం తగ్గ లేదంటూ ఆయన విమర్శలు గుప్పించారు. అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య జరిగిన చర్చ సందర్భంగా ఈ వ్యా ఖ్యలు చేశారు. "అధికారం పోయింది... కానీ అహంకారం పోలేదు" అంటూ రేవంత్ రెడ్డి ప్రతిపక్షాలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఇప్పటికైనా అహంకారం వదులుకో వాలని సూచించారు. ప్రజల తీర్పును గౌరవించి రాజకీ యంగా ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఆయన చమత్కార వ్యాఖ్యలు కూడా చేశారు. "మన ఊర్లలో అయితే వేపాకులతో కొడతారు అధ్యక్షా" అంటూ సభలో నవ్వులు పూయించారు. తనదైన శైలిలో చేసిన ఈ వ్యాఖ్యలు సభ్యుల దృష్టిని ఆకర్షించాయి.

మిగతా 2లో



మాక్ అసెంబ్లీలో రేవంత్‌పై బీఆర్ఎస్ విమర్శలు

- ఎమ్మెల్యేల సస్పెన్షన్‌కు నిరసనగా తెలంగాణ భవన్‌లో కార్యక్రమం
- ప్రభుత్వ హామీలు, పాలనపై వ్యంగ్యాస్త్రాలు
- ప్రజా సమస్యలపై చర్చకు అవకాశం ఇవ్వలేదని ఆరోపణ

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (తెలంగాణ ముచ్చట్లు):

అసెంబ్లీ నుంచి తమ పార్టీ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయడాన్ని నిర సిస్తూ బీఆర్ఎస్ శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మాక్ అసెంబ్లీ నిర్వహించింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభు త్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనపై పార్టీ నేతలు తీవ్ర విమర్శ లు గుప్పించారు. మాక్ అసెంబ్లీలో జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు స్పీకర్ పాత్ర పోషించగా, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ముఖ్యమంత్రి పాత్రలో పాల్గొని వ్యంగ్య ప్రసంగం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలు, రాజకీయ పరిణామాలపై ఆయన విమర్శలు చేశారు.

ఇటీవల మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తొలగించిన అంశాన్ని ప్రస్తావిస్తూ తలసాని వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. అలాగే కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఇంకా అమలు కాలేదని ఆరోపిస్తూ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.

మిగతా 2లో

ఆదిలాబాద్ విమానాశ్రయానికి గ్రీన్ సిగ్నల్

- ప్రాజెక్టు పనులు వేగవంతం: కిషన్ రెడ్డి
- రక్షణ శాఖ పూర్తి సహకారం అందిస్తోందని వెల్లడి
- అదనంగా 1,500 ఎకరాల భూసేకరణకు చర్యలు
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12 (తెలంగాణ ముచ్చట్లు)

ఉత్తర తెలంగాణ ప్రజల చిరకాల స్వప్నమైన ఆదిలాబాద్ విమానాశ్రయ ప్రాజెక్టు పనులు వేగవంతమయ్యాయని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. వాణిజ్య, వ్యూహాత్మక పరంగా కీలకమైన ఈ ప్రాజెక్టు పురోగతిపై శనివారం ఢిల్లీలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో సమావేశమై చర్చించినట్లు వె ల్లడించారు.

ఈ సందర్భంగా ఆదిలాబాద్‌లో సంయుక్త వినియోగ విమానాశ్రయం అభివృద్ధికి రక్షణ మంత్రిత్వ శాఖ పూర్తి సమ్మతి తెలిపినట్లు కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

మిగతా 2లో

కేసీఆర్‌తోనే తెలంగాణ వ్యవసాయ ప్రగతి

- బీఆర్ఎస్ పాలనలో సాగు విస్తీర్ణం పెరిగిందన్న జగదీశ్ రెడ్డి
- మిషన్ కాకతీయ, మిషన్ భగీరథతో గ్రామీణాభివృద్ధి జరిగిందని వ్యాఖ్య
- కాళేశ్వరం ద్వారా సూర్యాపేటకు గోదావరి జలాలు చేరాయని వెల్లడి

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (తెలంగాణ ముచ్చట్లు)



తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మాక్ అసెంబ్లీలో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మె ల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి బీఆర్ఎస్ ప్రభు త్వ పాలనలో రాష్ట్రం సాధించిన అభివృద్ధిని ప్రస్తావించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో వ్యవ సాయ రంగానికి అత్యధిక ప్రాధాన్యం

మిగతా 2లో

యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌కు కొత్త భవనం

- తొలి విద్యా భవన నిర్మాణానికి శంకుస్థాపన
- వచ్చే విద్యా సంవత్సరానికి 750 మంది విద్యార్థుల లక్ష్యం
- పోలీసు కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించడమే ధ్యేయం

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (తెలంగాణ ముచ్చట్లు)

తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ శనివారం యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ శాశ్వత ప్రాంగణంలోని తొలి విద్యా భవన నిర్మా ణానికి శంకుస్థాపన చేశారు. పోలీసు, ఇతర యూనిఫాం దళాల సిబ్బంది పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం 2024 డిసెంబరులో ఈ విద్యాసంస్థను ప్రారంభించిందని ఆయన తెలిపారు. యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ అభివృద్ధి ప్రయాణంలో ఇది మరో కీలక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు.

మిగతా 2లో



తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

గణేశ్ ఉత్సవాలపై సీఎం సమీక్ష

(మొదటి పేజీ తరువాయి)

ఈ సమావేశంలో మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, నగర ప్రజాప్రతినిధులు, మున్సిపల్, పోలీసు శాఖల ఉన్నతాధికారులు, గణేశ్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. ఉత్సవాల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై సమగ్రంగా చర్చించారు.

గణేశ్ ఉత్సవాల పర్యవేక్షణ కోసం సమీకృత నియంత్రణ కేంద్రంలో ప్రత్యేక నియంత్రణ గదిని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. హైదరాబాద్ నగరం ప్రశాంతంగా ఉన్నప్పుడే పెట్టుబడులు, అభివృద్ధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గణేశ్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలు సాఫీగా సాగేందుకు నిర్వాహకులు కూడా పూర్తి సహకారం అందించాలని ముఖ్యమంత్రి కోరారు. ఉత్సవాలకు సంబంధించిన ఏవైనా సమస్యలు ఎదురైతే వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని భరోసా ఇచ్చారు. నిర్వాహకుల సమస్యలను స్వయంగా తెలుసుకోవడానికే ఈ సమీక్ష సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గణేశ్ మండపాలకు అతిథులను ఆహ్వానించే సందర్భాల్లో ఆ వివరాలను స్థానిక పోలీసు అధికారులకు ముందుగానే అందించాలని ముఖ్యమంత్రి సూచించారు. ఎక్కడెక్కడ మండపాలు ఏర్పాటు చేస్తున్నారో ముందస్తుగా సమాచారం అందితే ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లు మరింత సమర్థవంతంగా చేపట్టేందుకు వీలవుతుందని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో గణేశ్ మండపాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, నిర్వాహకులు సంబంధిత అధికారుల వద్ద దరఖాస్తు చేసుకుని ఆ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని సూచించారు. నిమజ్జన కార్యక్రమాలు సజావుగా జరిగేలా చెరువుల వద్ద అవసరమైన మౌలిక సదుపాయాలను ముందుగానే ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. నిమజ్జన ప్రక్రియ వేగంగా పూర్తయ్యేందుకు చెరువుల వద్ద క్రేన్లు ఏర్పాటు చేయడానికి అనువైన ప్రత్యేక వసతులు కల్పించాలని సూచించారు. గణేశ్ ఉత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య, ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

ప్రతిపక్షాలు అహంకారం వీడాలి : రేవంత్

(మొదటి పేజీ తరువాయి)

మరోసారి మాట్లాడుతూ పోలేపల్లి జాతరకు తీసుకెళ్లి కొట్టాలా అని సరదాగా వ్యాఖ్యానించారు. అలాంటి పరిస్థితుల్లోనైనా జ్ఞానోదయం కలుగుతుందేమో అంటూ చేసిన వ్యాఖ్యలు సభలో నవ్వులు తెప్పించాయి. ఈ వ్యాఖ్యలపై అధికార పక్ష సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

సభలో జరిగిన చర్చల సందర్భంగా అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య పలుమార్లు వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు సభలో ప్రధాన చర్చగా మారాయి. రాజకీయ పరిణామాలు, ప్రజల తీర్పుపై కూడా ఆయన ప్రస్తావించారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీశాయి. అధికార పక్షం వాటిని సమర్థిస్తుండగా, ప్రతిపక్షాలు తమదైన రీతిలో స్పందిస్తున్నాయి. శాసనసభ సమావేశాల్లో చోటుచేసుకున్న ఈ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికర చర్చకు కారణమయ్యాయి.

మాక్ అసెంబ్లీలో రేవంత్‌పై బీఆర్ఎస్ విమర్శలు

(మొదటి పేజీ తరువాయి)

అసెంబ్లీలో మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసుల ప్రవర్తన, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆరోగ్యంపై చేసిన వ్యాఖ్యల అంశాలపై చర్చకు అవకాశం ఇవ్వాలని కోరినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. ఈ అంశాలపై పట్టుబట్టిన నేపథ్యంలో కేటీఆర్ సహా 22 మంది ఎమ్మెల్యేలను సస్పెండ్ చేశారని పేర్కొన్నారు.

ఎమ్మెల్యేల సస్పెన్షన్‌ను ప్రజాస్వామ్య విరుద్ధ చర్యగా అభివర్ణించిన బీఆర్ఎస్ నేతలు, ప్రజా సమస్యలపై చర్చకు ప్రభుత్వం దూరంగా ఉంటోందని విమర్శించారు. అసెంబ్లీలో చర్చించలేని అంశాలను ప్రజల ముందుకు తీసుకువచ్చేందుకే మాక్ అసెంబ్లీ నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేటీఆర్‌తో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ప్రజా సమస్యలకు సంబంధించిన ప్లకార్డులను ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేసిన నేతలు, ప్రభుత్వం ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు.



ఆదిలాబాద్ విమానాశ్రయానికి గ్రీన్ సిగ్నల్

(మొదటి పేజీ తరువాయి)

ప్రాజెక్టును వేగంగా ముందుకు తీసుకెళ్లేందుకు రక్షణ శాఖ, పౌర విమానయాన శాఖ, తెలంగాణ ప్రభుత్వాల నుంచి ఒక్కో నోడల్ అధికారిని వచ్చే వారంలోగా నియమించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర ప్రణాళిక, మాస్టర్ ప్లాన్ రూపకల్పనను త్వరితగతిన పూర్తి చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. గత ఏప్రిల్ 17న అధికారుల బృందం క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించి 2.75 కిలోమీటర్ల రన్‌వే నిర్మాణానికి ఆమోదం తెలిపిందని ఆయన గుర్తుచేశారు. విమానాశ్రయ నిర్మాణానికి అవసరమైన సాంకేతిక అంశాలన్నింటినీ పరిశీలించి తదుపరి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

ప్రస్తుతం భారత వైమానిక దళం ఆధీనంలో ఉన్న 369.45 ఎకరాల భూమికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం మరో 1,500 ఎకరాల భూమిని సేకరించనున్నట్లు కిషన్ రెడ్డి వెల్లడించారు. ప్రాజెక్టు విస్తరణకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేసే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు.

విమానాశ్రయ ప్రాంగణంలో వైమానిక దళ శిక్షణా కేంద్రాలు, హ్యాంగర్లతో పాటు పౌర విమాన సేవలకు అవసరమైన సదుపాయాలను కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. భారత విమానాశ్రయాల ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో పౌర విమానాల టెర్మినల్, నిర్వహణ కేంద్రాలు నిర్మించనున్నట్లు వెల్లడించారు.

ఆదిలాబాద్ విమానాశ్రయం అందుబాటులోకి వస్తే ఉత్తర తెలంగాణ అభివృద్ధికి కొత్త ఊపు వస్తుందని కిషన్ రెడ్డి అభిప్రాయపడ్డారు. రవాణా, వాణిజ్యం, పరిశ్రమలు, ఉపాధి అవకాశాల పెరుగుదలకు ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని తెలిపారు. ప్రాంతీయ అభివృద్ధికి ఈ విమానాశ్రయం కీలక కేంద్రంగా మారనున్నట్లు పేర్కొన్నారు.

కేసీఆర్‌తోనే తెలంగాణ వ్యవసాయ ప్రగతి

(మొదటి పేజీ తరువాయి)

కల్పించారని, రైతు సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేశారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పాలనలో రాష్ట్ర అభివృద్ధి, ముఖ్యంగా వ్యవసాయ రంగంలో నమోదైన పురోగతి దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిందని ఆయన అన్నారు.

తెలంగాణలో బీఆర్ఎస్ హయాంలో రెండు కోట్ల ఎకరాలకు పైగా భూమిని సాగులోకి తీసుకురావడంలో కేసీఆర్ ప్రభుత్వం కీలక పాత్ర పోషించిందని జగదీశ్ రెడ్డి తెలిపారు. సాగునీటి వసతుల విస్తరణ, రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా, వ్యవసాయ అనుకూల విధానాల అమలు కారణంగా పంటల ఉత్పత్తి గణనీయంగా పెరిగిందన్నారు. రైతు బంధు, రైతు బీమా వంటి పథకాలు వ్యవసాయ రంగానికి వెన్నుదన్నుగా నిలిచాయని పేర్కొన్నారు.

మిషన్ కాకతీయ కార్యక్రమం ద్వారా వేలాది చెరువులను పునరుద్ధరించి గ్రామీణ ప్రాంతాల్లో నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచామని ఆయన వివరించారు. చెరువుల పూడిక తొలగింపు, నీటి వనరుల అభివృద్ధి వల్ల భూగర్భ జలాలు పెరిగి రైతులకు ఎంతో మేలు జరిగిందన్నారు. ఈ కార్యక్రమం వ్యవసాయ ఉత్పాదకతను పెంచడమే కాకుండా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసిందని చెప్పారు.

మిషన్ భగీరథ పథకం తెలంగాణ ప్రజల జీవితాల్లో విప్లవాత్మక మార్పు తీసుకువచ్చిందని జగదీశ్ రెడ్డి అన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల తేడా లేకుండా ప్రతి ఇంటికీ శుద్ధమైన తాగునీటిని అందించడంలో ఈ పథకం విజయవంతమైందని తెలిపారు. దేశంలోనే ఆదర్శవంతమైన తాగునీటి సరఫరా వ్యవస్థను తెలంగాణలో ఏర్పాటు చేయడం కేసీఆర్ ప్రభుత్వ ఘనత అని ఆయన పేర్కొన్నారు.

కాళేశ్వరం ఎత్తిపోతల పథకం తెలంగాణ సాగునీటి చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిందని జగదీశ్ రెడ్డి చెప్పారు. ఈ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలు రాష్ట్రంలోని అనేక ప్రాంతాలకు చేరాయని, ముఖ్యంగా సూర్యాపేట జిల్లాలో సాగునీటి లభ్యత పెరిగి వ్యవసాయం అభివృద్ధి చెందిందన్నారు. ఒకప్పుడు నీటి కొరతతో ఇబ్బందులు పడిన ప్రాంతాల్లో ప్రస్తుతం పంటలు సమృద్ధిగా పండుతున్నాయని ఆయన వెల్లడించారు.

మాక్ అసెంబ్లీ వేదికగా మాట్లాడిన జగదీశ్ రెడ్డి, తెలంగాణ అభివృద్ధి కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలు ప్రజల జీవితాల్లో శాశ్వత మార్పులు తీసుకువచ్చాయని పేర్కొన్నారు. వ్యవసాయం, తాగునీరు, సాగునీటి రంగాల్లో సాధించిన విజయాలు కేసీఆర్ నాయకత్వానికి నిదర్శనమని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, రైతు సంక్షేమం, గ్రామీణ పురోగతి అంశాల్లో బీఆర్ఎస్ పాలనను ప్రజలు గుర్తుంచుకుంటారని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌కు కొత్త భవనం

(మొదటి పేజీ తరువాయి)

నూతన విద్యా భవనం 45 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించబడనుందని సీవీ ఆనంద్ తెలిపారు. ఇందులో విశాలమైన తరగతి గదులు, గ్రంథాలయం, కంప్యూటర్ మరియు విజ్ఞానశాస్త్ర ప్రయోగశాలలు, పరిపాలనా విభాగాలు, అంతర్జాతీయ ప్రమాణాల క్రీడా సదుపాయాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. పాఠశాల స్వయం సమృద్ధిని సాధించేందుకు మొత్తం సీట్లలో 50 శాతం ప్రైవేటు ప్రవేశాలకు కేటాయించనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌లో 360 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. వచ్చే ఏడాది మే నాటికి కొత్త భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. తద్వారా వచ్చే విద్యా సంవత్సరం నుంచి విద్యార్థుల సంఖ్యను సుమారు 750 మందికి పెంచే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

ప్రాథమిక స్థాయి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్య అందించేలా పాఠశాలను విస్తరిస్తున్నామని సీవీ ఆనంద్ వివరించారు. చిన్న తరగతుల విద్యార్థులు ప్రస్తుతం ఉన్న ప్రాంగణంలోనే కొనసాగుతారని, ఉన్నత తరగతుల విద్యార్థులను కొత్త ప్రాంగణానికి తరలిస్తామని తెలిపారు. 44 ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చెందుతున్న ఈ ప్రాంగణంలో ఇతర నిర్మాణాలు పూర్తికాగానే విద్యాసంస్థ సామర్థ్యం మరింత పెరుగుతుందని చెప్పారు.

2025 ఏప్రిల్‌లో తాత్కాలిక ప్రాంగణం ప్రారంభమైనప్పటి నుంచి యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ క్రమంగా అత్యుత్తమ విద్యాసంస్థగా ఎదుగుతోందని ఆయన పేర్కొన్నారు. ప్రణాళిక దశ నుంచి ఈ ప్రాజెక్టుతో అనుబంధం ఉన్న తనకు ఇటీవలి నెలల్లో పనులు మళ్లీ వేగం పుంజుకోవడం ఆనందంగా ఉందన్నారు. ప్రభుత్వ సహకారంతో సంస్థ నిర్వహణ వ్యవస్థను పునర్వ్యవస్థీకరించి, ప్రణాళికలను ఖరారు చేసి పనులను వేగవంతం చేసినట్లు తెలిపారు. పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు, దాతలు, శ్రేయోభిలాషుల సహకారంతో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ అత్యున్నత ప్రమాణాల విద్యాసంస్థగా అవతరిస్తుందని సీవీ ఆనంద్ విశ్వాసం వ్యక్తం చేశారు. విద్యార్థుల్లో సమగ్ర వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందిస్తూ ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే కేంద్రంగా ఈ పాఠశాల నిలుస్తుందని అన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో 87 వేల మంది పెరుగుదల: సీఎం

- **విద్యాశాఖ సంస్కరణల ఫలితమేనన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**
- **ఒక్క ఏడాదిలో 60 వేల మంది విద్యార్థుల నమోదు పెరిగిందని వెల్లడి**
- **ప్రభుత్వ బడులపై ప్రజల్లో విశ్వాసం పెరిగిందని వ్యాఖ్య**

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (తెలంగాణ ముచ్చట్లు)

రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి చేపట్టిన విద్యా సంస్కరణలు సానుకూల ఫలితాలను ఇస్తున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తాను విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందని తెలిపారు. గతంలో ప్రతి ఏడాది విద్యార్థుల నమోదు తగ్గుముఖం పట్టగా, ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మారిందని చెప్పారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం పెరగడం వల్లే ఈ మార్పు సాధ్యమైందన్నారు.

అసెంబ్లీలో మాట్లాడిన ముఖ్యమంత్రి, 202425 మరియు 202526 విద్యా సంవత్సరాల్లో కలిపి ప్రభుత్వ పాఠశాలల్లో 87 వేల మంది విద్యార్థులు అదనంగా చేరారని వెల్లడించారు. ముఖ్యంగా విద్యా రంగంలో చేపట్టిన సంస్కరణలు, పాఠశాలల అభివృద్ధి, మౌలిక సదుపాయాల మెరుగుదల ఈ పెరుగుదలకు కారణమయ్యాయని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలను నాణ్యమైన విద్యకు కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ ఒక్క ఏడాదిలోనే సుమారు 60 వేల మంది విద్యార్థుల నమోదు పెరగడం విద్యాశాఖ పనితీరుకు నిదర్శనమని రేవంత్ రెడ్డి అన్నారు. విద్యార్థుల నమోదు ప్రక్రియను సరళీకృతం చేయడంతో పాటు పాఠశాలల్లో అవసరమైన సౌకర్యాలను మెరుగుపరచడం ద్వారా తల్లిదండ్రుల్లో విశ్వాసం పెరిగిందని చెప్పారు. విద్యను అందరికీ అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

గతంలో ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రైవేటు విద్యాసంస్థల వైపు విద్యార్థుల వలస ఎక్కువగా ఉండేదని, ప్రస్తుతం ఆ ధోరణిలో మార్పు వచ్చిందని ముఖ్యమంత్రి వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన బోధన, మెరుగైన వసతులు, సాంకేతిక సదుపాయాల కల్పనతో విద్యార్థులు తిరిగి ప్రభుత్వ విద్యా వ్యవస్థ వైపు ఆకర్షితులవుతున్నారని అన్నారు. ఇది విద్యా రంగంలో సాధించిన ముఖ్యమైన విజయంగా అభివర్ణించారు.

తన పనితీరుపై విమర్శలు చేస్తున్న వారికి అధికారిక గణాంకాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించారు. విద్యాశాఖ మంత్రిగా తాను సమర్థవంతంగా పనిచేయడం లేదని ఆరోపిస్తున్న వారు ముందుగా ప్రభుత్వ పాఠశాలల్లో నమోదైన విద్యార్థుల సంఖ్యను పరిశీలించాలని అన్నారు. గణాంకాలే వాస్తవాలను చెబుతాయని, ప్రభుత్వం చేపట్టిన చర్యల ఫలితాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ విద్యను మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు పాఠశాలల్లో ఆధునిక సదుపాయాలను కల్పించేందుకు మరిన్ని చర్యలు చేపడతామని తెలిపారు. విద్యా రంగంలో తెలంగాణను దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా నిలబెట్టేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని ఆయన వెల్లడించారు.

బీజేపీలో చేరిన పలువురు ప్రముఖులు

- **నాంపల్లి రాష్ట్ర కార్యాలయంలో చేరికల కార్యక్రమం**
- **పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన ఎన్. రామచంద్రరావు**
- **మోదీ నాయకత్వానికి ఆకర్షితులై చేరుతున్న ప్రజలు**

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (తెలంగాణ ముచ్చట్లు)

నాంపల్లిలోని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం వివిధ రంగాలకు చెందిన పలువురు ప్రముఖ నాయకులు బీజేపీలో చేరారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కొత్తగా చేరిన వారికి స్వాగతం పలికారు. చేరికల కార్యక్రమంలో మాట్లాడిన ఎన్. రామచంద్రరావు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వం దేశ ప్రజల్లో విశ్వాసాన్ని పెంచిందని అన్నారు. అభివృద్ధి, సుపరిపాలన, జాతీయత భావజాలంతో ముందుకు సాగుతున్న బీజేపీ వైపు అన్ని వర్గాల ప్రజలు ఆకర్షితులవుతున్నారని పేర్కొన్నారు. దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలనే సంకల్పంతో పలువురు పార్టీని ఆశ్రయిస్తున్నారని తెలిపారు.

సమాజంలోని వివిధ రంగాలకు చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు బీజేపీ సిద్ధాంతాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని ఆయన చెప్పారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లో విశేష ఆదరణ పొందుతున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పార్టీ మరింత బలపడుతోందని వివరించారు. కొత్తగా పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తోందని అన్నారు. ప్రజాసేవ చేయడానికి బీజేపీ ఉత్తమ వేదికగా భావించి పార్టీలో చేరినట్లు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
ఆదివారం - 13 - సెప్టెంబర్ - 2026
వరంగల్ 03

అభివృద్ధి పనుల్లో నాణ్యతే కీలకం

- కాశ్మీర్‌గడ్డలో సీసీ రోడ్డు నిర్మాణం ప్రారంభం
- పనులు త్వరగా, నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులకు సూచన
- మౌలిక వసతుల కల్పనకు అత్యధిక ప్రాధాన్యం: యాదగిరి సునీల్ రావు

కరీంనగర్, సెప్టెంబర్ 12(తెలంగాణ ముచ్చట్లు):నగరంలోని ప్రతి డివిజన్‌లో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగర డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు తెలిపారు.
కరీంనగర్ నగర అభివృద్ధిలో భాగంగా 42వ డివిజన్‌లోని కాశ్మీర్‌గడ్డ మునావర్ మసీదు వీధిలో నూతనంగా చేపడుతున్నసీసీ రోడ్డు నిర్మాణ పనులకు యాదగిరి సునీల్ రావు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. అనంతరం నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.
పనుల సమయంలో స్థానిక ప్రజలు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని, నాణ్యతా ప్రమాణాల్లో రాజీ పడకుండా పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.
ఈ సందర్భంగా యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ.. గతంలో 42వ డివిజన్ సమస్యలు తక్కువగా ఉన్న డివిజన్‌గా ప్రత్యేక గుర్తింపు పొందిందని, అదే తరహాలో ప్రస్తుతం డివిజన్‌లో కొత్తగా చేరిన అన్ని ప్రాంతాలను కూడా అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తూ స్థానిక సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని తెలిపారు.
వివేకానంద స్కూల్ పరిసర ప్రాంతాల్లో కూడా త్వరలో అభివృద్ధి పనులు ప్రారంభిస్తామని, అక్కడి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని చెప్పారు. అలాగే జిల్లా పరిషత్ క్వార్టర్స్ వద్ద ఉన్న పార్కును త్వరలోనే అధునాతన రీతిలో అభివృద్ధి చేసి ప్రజలకు పునరంకితం చేస్తామని వెల్లడించారు.
డివిజన్ వ్యాప్తంగా రోడ్లు, డ్రైనేజీ, పార్కులు తదితర మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని యాదగిరి సునీల్ రావు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ టి. చంద్రమౌళి, శ్రీధర్, అశోక్, వినోద్ కుమార్, విజయ భాస్కర్, ఖాదర్ ఫారుకి, ఇబ్రహీం, తబ్రేజ్, షారుక్, మహమ్మద్ ఆబిద్, డివిజన్ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

యువతలో దేశభక్తి, బాధ్యతా భావం పెంపొందాలి

- వివేకానంద కళాశాలలో "నా దేశం – నా జాతి – నా బాధ్యత" కార్యక్రమం
- స్వామి వివేకానంద సందేశాలు నేటి యువతకు మార్గదర్శకం-మేయర్ కొలగాని శ్రీనివాస్

కరీంనగర్, సెప్టెంబర్ 12(తెలంగాణ ముచ్చట్లు): కరీంనగర్ జిల్లా కేంద్రంలోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలలో "నా దేశం - నా జాతి - నా బాధ్యత" అనే అంశంపై వ్యక్తిత్వ నిర్మాణ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. నేషనల్ యూత్ ప్రాజెక్ట్ సౌజన్యంతో జరిగిన ఈ కార్యక్రమానికి నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.
1893 సెప్టెంబర్ 11న అమెరికాలోని చికాగో నగరంలో జరిగిన సర్వమత సమ్మేళనంలో స్వామి వివేకానంద చేసిన చారిత్రాత్మక ప్రసంగం భారతదేశ ఔన్నత్యాన్నిప్రపంచానికి చాటిందని మేయర్ తెలిపారు. స్వామి వివేకానంద చూపిన మార్గం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. విద్యార్థులు స్వామి వివేకానంద బోధనలు, ఆధ్యాత్మిక సందేశాలను ఆదర్శంగా తీసుకుని క్రమశిక్షణ, పట్టుదల, అంకితభావం, కఠోర శ్రమతో జీవితంలో ముందుకు సాగాలని సూచించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ ఉన్నతమైన విలువలతో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. జిల్లా యువజన అధికారి జి. తిరుపతిరెడ్డి మాట్లాడుతూ విద్యతో పాటు వివిధ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని, సన్మార్గంలో నడుస్తూ విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలని సూచించారు.
కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్. శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసం, దేశభక్తి, సామాజిక బాధ్యతను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో ఏసీఓ బి. సంపత్ కుమార్, ఏవో బి. శ్రావణ్ కుమార్, కామర్స్ విభాగాధిపతి డాక్టర్ ఆర్. గోపికృష్ణ, నేషనల్ యూత్ ప్రాజెక్ట్ బాధ్యులు కె. యాదవరాజు, ఎం.డి. తాహర్ పాషా, అధ్యాపక బృందం, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేసిన కేశిరెడ్డి రాకేష్ రెడ్డి



చిల్పూర్, సెప్టెంబర్ 12 (తెలంగాణ ముచ్చట్లు): ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మండలంలోని చిల్పూర్ గ్రామానికి చెందిన గాదె రవి కుటుంబాన్ని బీఆర్ఎస్ పార్టీ జిల్లా యువజన నాయకుడు కేశిరెడ్డి రాకేష్ రెడ్డి శనివారం పరామర్శించారు. మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా రవి కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కుటుంబానికి రాబోయే రోజుల్లో అన్ని విధాలుగా అండగా ఉంటామని కేశిరెడ్డి రాకేష్ రెడ్డి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు జనగామ యాదగిరి, నారగోని రాజు, మాచర్ల ప్రవీణ్, ఎట్ల రాజేష్, కుమార్, ప్రణయ్, రమాకాంత్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వినాయక మండపాల నిర్వాహకులు పోలీసుల సూచనలు పాటించాలి

- చిల్పూర్ ఎస్సై సిరిపురం నవీన్ కుమార్

చిల్పూర్,సెప్టెంబర్12(తెలంగాణ ముచ్చట్లు): మండలంలోని ప్రతి గ్రామంలో రాబోయే వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేయనున్న మండపాల నిర్వాహకులు పోలీసు శాఖ సూచనలు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని చిల్పూర్ ఎస్సై సిరిపురం నవీన్ కుమార్ విజ్ఞప్తి చేశారు.ప్రతి వినాయక మండపం ఏర్పాటుకు ముందుగా పోలీస్‌స్టేషన్ అనుమతిని ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా పూర్తి చేయాలని, ఇందుకోసం ఎవరూ పోలీస్‌స్టేషన్‌కు రావాల్సిన అవసరం లేదన్నారు. అనుమతి కోసం https://policeportal.tspolice.gov.in/index.htmలింక్ ద్వారా సరైన వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. మండపం ఏర్పాటుకు విద్యుత్ శాఖ అనుమతి కూడా పొందాలని తెలిపారు. భద్రత కోసం మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం మంచిదన్నారు. రాత్రి 10 గంటల తర్వాత లౌడ్‌స్పీకర్లు, డీజేలు వినియోగించరాదని, నిబంధనల ప్రకారం సౌండ్ లిమిట్ పాటించాలని సూచించారు.
రోడ్డుపై ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే విధంగా మండపాలు ఏర్పాటు చేయరాదని, శాంతి భద్రతలకు భంగం కలగకుండా ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

కామ్రేడ్ సీతారాం ఆశయాలను కొనసాగించాలి

- సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి వర్ధంతి

స్టేషన్ ఘనపూర్, సెప్టెంబర్ 12(తెలంగాణ ముచ్చట్లు): కామ్రేడ్ సీతారాం ఏచూరి రెండో వర్ధంతి సందర్భంగా స్టేషన్ ఘనపూర్‌లోని సీపీఎం పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు ఇరి అహల్య, మండల కార్యదర్శి మునిగల రమేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..భారత రాజకీయాల్లో చెరగని ముద్ర వేసిన సీతారాం ఏచూరి ఆశయాలను కొనసాగిస్తూ ప్రజా ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. రాజ్యసభ సభ్యునిగా పార్లమెంట్‌లో ప్రజల గొంతుకగా నిలిచి, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను సమర్థంగా ప్రశ్నించారని గుర్తు చేశారు. ఆయన ప్రసంగాలు, విషయ పరిజ్ఞానం, ప్రజా సమస్యల పట్ల నిబద్ధతకు ప్రతీకగా నిలిచాయని అన్నారు. ప్రజల ఐక్యతను కాపాడుతూ కార్పొరేట్ అనుకూల, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలను ఉధృతం చేయడమే కామ్రేడ్ ఏచూరికి నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఆయన చూపిన మార్గంలో పార్టీ శ్రేణులు ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ ఆశయ సాధన కోసం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు కుర్ర ఉప్పలయ్య, కత్తుల రాజు, గట్ల మల్లారెడ్డి, తోడెంగల ఐలయ్య, చిలుముల్ల భాస్కర్, పరమేష్, కిష్టయ్య, రామగోని సతీష్, సట్ల రాజు, దైద కుమార్, లింగన్న బోయిన కుమార్, సుధాకర్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బుగులు వెంకటేశ్వర స్వామివారి వార కల్యాణం

స్టేషన్ ఘనపూర్, సెప్టెంబర్ 12 (తెలంగాణ ముచ్చట్లు): రుణ బాధల నుంచి విముక్తి కలిగించి, భక్తుల కోర్కెలు తీర్చే కొంగు బంగారం, కలియుగ దైవం చిల్పూర్‌గుట్ట శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామివారి వార కల్యాణం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామివారికి వేద పండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఉదయం నుంచే స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు నిర్వహించి, మంగళ వాయిద్యాల నడుమ కల్యాణ వేడుకను ఘనంగా నిర్వహించారు. స్థల పురాణం ప్రకారం.. పద్మావతి అమ్మవారితో వివాహం కోసం కుబేరుని వద్ద అప్పు చేసిన స్వామివారు, ఆ రుణ భారంతో తపస్సు చేసిన పుణ్యక్షేత్రమే చిల్పూర్‌గుట్ట అని భక్తుల విశ్వాసం. అందుకే ఇక్కడ స్వామివారిని దర్శించుకుని అఖండ దీపంలో నూనె పోస్తే అప్పుల బాధల నుంచి విముక్తి లభిస్తుందని భక్తుల ప్రగాఢ నమ్మకం.కల్యాణ మహోత్సవానికి జనగామ జిల్లా నలుమూలల నుంచే కాకుండా హైదరాబాద్-వరంగల్ హైవే మార్గం నుంచి కూడా వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ప్రతి శుక్రవారం అభిషేకం, శనివారం ప్రత్యేక పూజలతో పాటు వార కల్యాణం నిర్వహిస్తున్నట్లు అర్చకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ శ్రీమన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, ధర్మకర్త మండలి సభ్యులు గోలీ రాజశేఖర్, వేముల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఆలయ ఈవో బి. లక్ష్మీ ప్రసన్న ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అర్చకులు బ్రాహ్మణపల్లి రవీందర్ శర్మ, అర్చకులు సౌమిత్రి శ్రీరంగాచార్యులు, కృష్ణమాచార్యులుతో పాటు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నిత వెంకట ఆశ్రిత (విజయవాడ), పాలిన అప్పలస్వామి-సత్యావతి, సానికొమ్ము వెంకట్ రెడ్డి-వెంకట రత్తమ్మ, గానగాని ఆనంద్-నిర్మల (ఆలేరు) వాస్తవ్యులు అన్నప్రసాద వితరణ చేపట్టారు.

స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలకు కాంగ్రెస్ డప్పు ధర్నా

- దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచేలా బీఆర్ఎస్ వ్యవహరించిందని ఆరోపణ

పెద్దమందడి,సెప్టెంబర్12(తెలంగాణ ముచ్చట్లు): అసెంబ్లీ స్పీకర్‌పై బీఆర్ఎస్ నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ వనపర్తి జిల్లా పెద్దమందడి మండలంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో డప్పు ధర్నా నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొమ్ము వెంకట స్వామి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు డప్పులు వాయిస్తూ నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న అసెంబ్లీ స్పీకర్‌ను కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు.బీఆర్ఎస్ నాయకుల వ్యవహారశైలి దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉందని ఆరోపించారు.మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీకి హాజరు కావాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ నాయకులు డప్పు ప్రదర్శనలతో కేసీఆర్ ఫామ్‌హౌస్‌ను ముట్టడించే ప్రయత్నం చేస్తే.. కాంగ్రెస్ నాయకులు అక్కడి నుంచి వెళ్లిపోయిన అనంతరం, బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ నాయకులు డప్పు ప్రదర్శన నిర్వహించిన స్థలాన్ని పసుపు నీళ్లతో శుద్ధి చేయడం దళితులను అవమానించే చర్యగా కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు.డప్పు ప్రదర్శన జరిగిన స్థలాన్ని పసుపు నీళ్లతో శుద్ధి చేయడాన్ని దళితుల ఆత్మగౌరవానికి సంబంధించిన అంశంగా పేర్కొంటూ కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా నిరసించారు. దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచేలా వ్యవహరించడం సరికాదని, రాజ్యాంగబద్ధమైన పదవులకు ప్రతి ఒక్కరూ గౌరవం ఇవ్వాలని డిమాండ్ చేశారు.బీఆర్ఎస్ నాయకుల తీరును నిరసిస్తూ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని, రాజ్యాంగబద్ధ పదవులకు గౌరవం ఇవ్వాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ సిబ్బంది విధుల నిర్వహణలో భద్రత పాటించాలి

- 33/11 కేవీ తాటికొండ విద్యుత్ ఉపకేంద్రాన్ని పరిశీలించిన ఏడీఈ రణధీర్ రెడ్డి

స్టేషన్ ఘనపూర్, సెప్టెంబర్ 12 (తెలంగాణ ముచ్చట్లు): వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పుల నేపథ్యంలో విద్యుత్ సిబ్బంది, సబ్‌స్టేషన్ ఆపరేటర్లు అప్రమత్తంగా ఉండాలని స్టేషన్ ఘనపూర్ విద్యుత్ ఆపరేషన్ ఏడీఈ పాల్వాయి రణధీర్ రెడ్డి సూచించారు. శనివారం మండల పరిధిలోని 33/11 కేవీ తాటికొండ విద్యుత్ ఉపకేంద్రాన్ని ఆయన సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్‌స్టేషన్ నుంచి వివిధ గ్రామాలకు విద్యుత్ సరఫరా అవుతున్న 11 కేవీ ఫీడర్లతో పాటు వాటి బ్యాటరీలను పరిశీలించారు. విద్యుత్ సరఫరా తీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, సరఫరాలో ఏర్పడే అంతరాయాలను ముందుగానే గుర్తించాలని సూచించారు. విద్యుత్ పరికరాలు దెబ్బతినకుండా ట్రిప్పింగ్ ద్వారా రక్షించే బ్యాటరీల పనితీరును గంటగంటకు పరిశీలించాలని ఆపరేటర్లకు సూచించారు.
విద్యుత్ సిబ్బంది విధుల నిర్వహణలో అప్రమత్తంగా ఉంటూ భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని అన్నారు. ముఖ్యంగా వన్ మినిట్ రూల్ విధానాన్ని కచ్చితంగా పాటించడం ద్వారా ప్రమాదాల నుంచి తమను తాము కాపాడుకోవడంతో పాటు సహచరులను కూడా రక్షించుకోవచ్చని తెలిపారు.గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మండపాల వద్ద విద్యుత్ భద్రతపై నిర్వాహకులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. మండపాల వద్ద విద్యుత్ సరఫరా ఏర్పాట్లను విద్యుత్ శాఖ సిబ్బంది పర్యవేక్షణలోనే చేపట్టాలని గణేష్ ఉత్సవ నిర్వహణ కమిటీ సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఘనపూర్ ఏఈ పి. శంకర్, లైన్మెన్ సురేందర్ రెడ్డి, ఏఎల్ఎం సోమరాజు తదితరులు ఏడీఈ రణధీర్ రెడ్డి వెంట ఉన్నారు.



తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

టీబీ బాధితుల సంక్షేమానికి చేయూత

- మానకొండూర్‌లో ఉచిత ఆహార సరుకులు పంపిణీ చేసిన డా. కవ్వంపల్లి అనురాధ

మానకొండూర్, సెప్టెంబర్ 12(తెలంగాణ ముచ్చట్లు): మానకొండూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల పరిధిలోని టీబీ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా ఆహార సరుకులను పంపిణీ చేశారు. మానకొండూర్ నియోజకవర్గ శాసనసభ్యులు, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డా. కవ్వంపల్లి సత్యనారాయణ గారి సతీమణి, అంకిత్ మల్టీ స్పెషలిటీ హాస్పిటల్స్ ఎం.డీ డా. కవ్వంపల్లి అనురాధ ఈ కార్యక్రమంలో పాల్గొని టీబీ బాధితులకు ఆహార కిట్లను అందజేశారు. టీబీ వ్యాధిగ్రస్తులకు వైద్య చికిత్సతో పాటు పౌష్టికాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యం మెరుగుపడేందుకు సహకరించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా మందులు వినియోగిస్తూ, వైద్యుల సూచనలు పాటించాలని ఆమె సూచించారు. సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన టీబీ బాధితులకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఆమె కోరారు.

వెల్టూర్‌కు తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు అభినందనీయం

- కొమ్ము వెంకటస్వామి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు

పెద్దమందడి,సెప్టెంబర్12(తెలంగాణ ముచ్చట్లు): వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామానికి తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు కావడం అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, మాజీ జెడ్పీటీసీ కొమ్ము వెంకటస్వామి అన్నారు. జీఓ నంబర్ 164 ద్వారా రూ.11.75 కోట్ల అంచనా వ్యయంతో తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు చేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా కొమ్ము వెంకటస్వామి మాట్లాడుతూ.. వెల్టూర్ గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఈ పాఠశాల ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమన్నారు.వెల్టూర్‌కు తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు చేయించడంలో ఎమ్మెల్యే మేఘారెడ్డి చూపిన చొరవ అభినందనీయమని కొమ్ము వెంకటస్వామి అన్నారు. గ్రామీణ విద్యార్థులకు మెరుగైన విద్యా వసతులు కల్పించాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే చేస్తున్న కృషికి ఈ పాఠశాల మంజూరు నిదర్శనమని పేర్కొన్నారు.వెల్టూర్ గ్రామ అభివృద్ధి, విద్యారంగ ప్రగతికి సహకరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి, ఎంపీ మల్లు రవిలకు గ్రామ ప్రజల తరపున ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

- పెద్దమందడి డిప్యూటీ తహసిల్దార్ గౌస్

పెద్దమందడి,సెప్టెంబర్12(తెలంగాణ ముచ్చట్లు): 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని వనపర్తి జిల్లా పెద్దమందడి డిప్యూటీ తహసిల్దార్ గౌస్ సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా పెద్దమందడిలో పత్రాలను పరిశీలించిన ఆయన, ఈ సందర్భంగా ఓటరు నమోదుపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా డిప్యూటీ తహసిల్దార్ గౌస్ మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఫారం-6 ద్వారా ఓటరుగా తమ పేరును నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటరు జాబితాలో తమ పేరు ఉందో లేదో ప్రతి ఒక్కరూ పరిశీలించుకోవాలని తెలిపారు.అర్హత ఉన్న యువత ఓటరుగా నమోదు చేసుకోవడంతో పాటు, ఓటరు జాబితాలో ఏవైనా తప్పులు లేదా మార్పులు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా పత్రాల పరిశీలనను అధికారులు చేపడుతున్నారని, ప్రజలు అధికారులకు అవసరమైన సహకారం అందించాలని డిప్యూటీ తహసిల్దార్ గౌస్ కోరారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ సిబ్బంది, బి ఎల్ వో లు పాల్గొన్నారు.

రైతుల పంటలు ఎండిపోకుండా వెంటనే సాగునీరు విడుదల చేయాలి

- బీఆర్ఎస్ నాయకులు మల్లికార్జున్ రెడ్డి

పెద్దమందడి,సెప్టెంబర్11(తెలంగాణ ముచ్చట్లు): రైతులు సాగు చేసిన పంటలు ఎండిపోకుండా ప్రభుత్వం తక్షణమే స్పందించి సాగునీటిని విడుదల చేయాలని పెద్దమందడి మండలం మోజర్లకు చెందిన బీఆర్ఎస్ నాయకులు మల్లికార్జున్ రెడ్డి డిమాండ్ చేశారు. సాగునీటి విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని అన్నారు.ఈ సందర్భంగా మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతులు పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేశారని, ప్రస్తుతం పంటలకు నీరు అత్యవసరంగా ఉందన్నారు. ఈ సమయంలో సాగునీరు అందకపోతే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.మూడు పంపులను నిరంతరాయంగా నడిపించి అక్టోబర్ 31 వరకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. శ్రీశైలం జలాశయం నుంచి అవసరమైన మేరకు నీటిని ఎత్తిపోసి రైతుల పంటలకు నిరంతరాయంగా నీరు అందించేలా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.రైతుల పంటలు ఎండిపోతే వారి పరిస్థితి మరింత దయనీయంగా మారుతుందని, ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని వీడి రైతుల పంటలకు సాగునీరు అందించడంపై ప్రత్యేక దృష్టిసారించాలని మల్లికార్జున్ రెడ్డి డిమాండ్ చేశారు.

డప్పు ధర్నాలో పాల్గొన్న వెల్టూర్ కాంగ్రెస్ నాయకులు

- స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ ఆందోళన

పెద్దమందడి,సెప్టెంబర్12(తెలంగాణ ముచ్చట్లు): అసెంబ్లీ స్పీకర్‌పై బీఆర్ఎస్ నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ పెద్దమందడి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన డప్పు ధర్నాలో వెల్టూర్ గ్రామ కాంగ్రెస్ నాయకులు పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొమ్ము వెంకటస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ధర్నాలో వెల్టూర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని డప్పులు వాయిస్తూ బీఆర్ఎస్ తీరును నిరసించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న అసెంబ్లీ స్పీకర్‌ను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. స్పీకర్ పదవికి ప్రతి ఒక్కరూ గౌరవం ఇవ్వాలని, రాజకీయ విమర్శల పేరుతో రాజ్యాంగబద్ధ పదవులను అవమానించడం సరికాదని పేర్కొన్నారు.అదేవిధంగా కాంగ్రెస్ నాయకులు చేపట్టిన డప్పు ప్రదర్శన జరిగిన ప్రాంతాన్ని బీఆర్ఎస్ నాయకులు పసుపు నీళ్లతో శుద్ధి చేయడం దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచే చర్యగా వారు అభివర్ణించారు. ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తూ వెల్టూర్ కాంగ్రెస్ నాయకులు ధర్నాలో నినాదాలు చేశారు.దళితుల ఆత్మగౌరవాన్ని కాపాడాలని, ప్రజాస్వామ్య విలువలను గౌరవించాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. రాజ్యాంగబద్ధ పదవుల పట్ల గౌరవంతో వ్యవహరించాలని, భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు, చర్యలకు పాల్పడకుండా రాజకీయ పార్టీలు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ మల్లికార్జున్, పెద్దమందడిఖిల్లా గణపురం మండలాల మార్కెట్ యార్డు డైరెక్టర్ రవీందర్,వార్డు సభ్యులు నాగ భూషణ్, మద్దూరు వెంకటయ్య, పాముల రాములు, దయ్యాల అంజన్న, దయ్యాల అశోక్, దయ్యాల నాగన్న, నాగన్న, తదితరులు పాల్గొన్నారు.



దళిత జర్నలిస్టుల పోరం 11వ రాష్ట్ర మహాసభను విజయవంతం చేయండి

- కాశపోగు జాన్, దళిత జర్నలిస్టుల ఫోరం వ్యవస్థాపకులు
- కొత్తకోట ఎస్సై విక్రమ్ చేతుల మీదుగా వాల్‌పోస్టర్ విడుదల

కొత్తకోట,సెప్టెంబర్12(తెలంగాణ ముచ్చట్లు): వచ్చే నెల 7వ తేదీన సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న దళిత జర్నలిస్టుల పోరం 11వ రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని దళిత జర్నలిస్టుల పోరం వ్యవస్థాపకులు కాశపోగు జాన్ పిలుపునిచ్చారు. మహాసభకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను శనివారం కొత్తకోట పోలీస్ స్టేషన్‌లో ఎస్సై విక్రమ్, సెకండ్ ఎస్సై భాస్కర్ నాయుడు చేతుల మీదుగా విడుదల చేశారు.ఈ సందర్భంగా కాశపోగు జాన్ మాట్లాడుతూ.. దళిత జర్నలిస్టులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన న్యాయమైన డిమాండ్ల సాధన కోసం దళిత జర్నలిస్టుల పోరం నిరంతరం పోరాడుతోందన్నారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని, దళిత జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలతో పాటు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అర్హులైన జర్నలిస్టులకు హెల్త్ కార్డులు మంజూరు చేసి తక్షణమే అమల్లోకి తీసుకురావాలని, దళిత జర్నలిస్టులకు అభయహస్తం పథకం కింద సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని కోరారు. అక్రిడిటేషన్ కమిటీలో దళిత జర్నలిస్టులకు ప్రాతినిధ్యం కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.దళిత జర్నలిస్టుల సమస్యలు, హక్కులు, భవిష్యత్ కార్యాచరణపై మహాసభలో చర్చించనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దళిత జర్నలిస్టులంతా పెద్ద సంఖ్యలో హాజరై 11వ రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని కాశపోగు జాన్ కోరారు. అనంతరం ఎస్సై విక్రమ్‌ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ కార్యదర్శి ధనుష్, దళిత జర్నలిస్టుల పోరం లీగల్ అడ్వైజర్ మునగారి కృష్ణ, మాజీ కోఆప్షన్ సభ్యులు మిషేక్, కాంగ్రెస్ పట్టణ మాజీ అధ్యక్షుడు మేస్త్రి శ్రీను, సీనియర్ జర్నలిస్టు ఈశ్వర్, దిశ రమేష్, బాలరాజు, లక్ష్మణ్, దాసు తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణ నంది పురస్కారంతో సదానిరంజన్ సిద్ధాంతికి ఘన సత్కారం

ఎల్కతుర్తి , సెప్టెంబర్ 12 (తెలంగాణ ముచ్చట్లు): సాంస్కృతిక, ఆధ్యాత్మిక రంగాల్లో విశేష సేవలు అందిస్తున్న శివ శ్రీ సదానిరంజన్ సిద్ధాంతికి ప్రతిష్ఠాత్మక స్వర్ణ నంది పురస్కారం లభించింది. ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ బొగ్గులకుంటలోని సారస్వత పరిషత్‌లో కళానిలయం సాంస్కృతిక సంఘ సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన గురువందనం, ఆత్మీయ సత్కార కార్యక్రమంలో ఆయనను ఘనంగా సత్కరించారు.కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పూర్వ మంత్రి శ్రీ సముద్రాల వేణుగోపాలచారి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, కళాకారులు, సాంస్కృతిక రంగ ప్రముఖులను ఘనంగా సన్మానించారు. కళానిలయం సాంస్కృతిక సంఘ సేవా సంస్థ గత 26 సంవత్సరాలుగా కళలు, సాహిత్యం, సంస్కృతి, ఆధ్యాత్మికతతో పాటు పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ సమాజానికి అందిస్తున్న సేవలను వక్తలు కొనియాడారు.అర్చక పురోహితులు, వాస్తు-జ్యోతిష్య పండితులుగా ఆధ్యాత్మిక, ధార్మిక, వాస్తు, జ్యోతిష్య రంగాల్లో సదానిరంజన్ సిద్ధాంతి అందిస్తున్న సేవలను గుర్తిస్తూ ఆయనకు స్వర్ణ నంది పురస్కారాన్ని ప్రదానం చేశారు. తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ శ్రీ ఉప్పల శ్రీనివాస్ గుప్త చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందజేశారు. ప్రజలకు ఆధ్యాత్మిక, ధార్మిక విషయాల్లో మార్గదర్శకత్వం అందిస్తూ, వాస్తు-జ్యోతిష్య రంగాల్లో సేవలందిస్తున్న సదానిరంజన్ సిద్ధాంతికి ఈ పురస్కారం దక్కడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు. ఆయన సేవలకు లభించిన ఈ గౌరవం మరింత మంది సేవా కార్యక్రమాల వైపు ప్రేరేపిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సదానిరంజన్ సిద్ధాంతి మాట్లాడుతూ తనకు లభించిన స్వర్ణ నంది పురస్కారం మరింత బాధ్యతను పెంచిందన్నారు. సమాజానికి తన వంతు సేవలను మరింత విస్తృతంగా కొనసాగిస్తానని తెలిపారు. తనను గుర్తించి స్వర్ణ నంది పురస్కారంతో ఘనంగా సత్కరించిన కళానిలయం సాంస్కృతిక సంఘ సంస్థ నిర్వాహకులు, ఏ.సురేందర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సాంస్కృతిక, సాహిత్య, ఆధ్యాత్మిక రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు, కళానిలయం సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక
ఆదివారం - 13 - సెప్టెంబర్ - 2026

జమ్మికుంట మార్కెట్‌యార్డుకు పూర్వవైభవం తీసుకురావాల

- **నూతన కాటన్ మిల్స్ ప్రతినిధులకు అడ్తిదారుల సంఘం ఘన సన్మానం**

జమ్మికుంట టౌన్ సెప్టెంబర్ 12 (తెలంగాణ ముచ్చట్లు): రాష్ట్ర కాటన్ జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ మిల్స్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన దొణకొండ మల్లారెడ్డి, జిల్లా కాటన్ జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ మిల్స్ అధ్యక్షుడిగా ఎన్నికైన బచ్చు భాస్కర్లను జమ్మికుంట అడ్తిదారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు.స్థానిక అడ్తిదారుల సంక్షేమ సంఘ భవనంలో సంఘం అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన ప్రతినిధులను గజమాలలు, శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ.. జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ యార్డుకు గత వైభవాన్ని తిరిగి తీసుకురావడానికి నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఇద్దరు నాయకులు తమవంతు కృషి చేయాలని కోరారు. మార్కెట్‌యార్డులో రైతులు, వర్తకులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

రైతు, వర్తకుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తూ జమ్మికుంట మార్కెట్‌యార్డు అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. మార్కెట్‌కు మరింత పంటల రాక పెరిగేలా, రైతులకు గిట్టుబాటు ధరలు, వర్తకులకు అనుకూలమైన వాతావరణం కల్పించే దిశగా చర్యలు చేపట్టాలని కోరారు.

ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖ వ్యాపారులు, అడ్తిదారులు, దాడ్వాయిలు, హమాలీలు, సంఘ సభ్యులు తదితరులు పాల్గొని నూతనంగా ఎన్నికైన ప్రతినిధులను ఘనంగా సత్కరించారు.

పెయింటర్ల సమస్యలకు అండగా ఉంటా



జమ్మికుంట టౌన్ సెప్టెంబర్ 12 (తెలంగాణ ముచ్చట్లు): జమ్మికుంట పట్టణ పెయింటర్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. అధ్యక్షుడిగా చొల్లేటి శ్యామ్, ఉపాధ్యక్షుడిగా పొడేటి మొగిలి, గౌరవ అధ్యక్షుడిగా జక్కే రవీందర్ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్‌కుమార్ (దిలీప్) శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. జమ్మికుంట పట్టణంలో పెయింటింగ్, పుట్టి, సీలింగ్ తదితర నిర్మాణ రంగాలకు సంబంధించిన పనులు నిర్వహించే కార్మికులు, పెయింటర్లకు నూతన కమిటీ ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు. కమిటీ సభ్యులంతా ఐక్యతతో పనిచేస్తూ పెయింటర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు పట్టణ అభివృద్ధిలో తమవంతు సహకారం అందించాలని కోరారు.

పెయింటర్లకు ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని, భవన నిర్మాణం, పెయింటింగ్ పనుల్లో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు, లేబర్ కార్డులు, హెల్త్ కార్డులు తదితర ప్రయోజనాలు అర్హులైన ప్రతి కార్మికుడికి అందేలా అవసరమైన సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.

కార్మికుల సంక్షేమం, సమస్యల పరిష్కారం, సంఘం బలోపేతం లక్ష్యంగా నూతన కమిటీ పనిచేయాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, జక్కే ప్రభాకర్, చరణ్, నర్సయ్య, యాదగిరి, జమీర్, జానీ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యానికి గురుకుల విద్యార్థులే బలి కావాలా?

- **-బీజేపీ మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్,**

ఎల్కతుర్తి, సెప్టెంబర్ 12 (తెలంగాణ ముచ్చట్లు): ఎల్కతుర్తి సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఇటీవల పత్రికల్లో కథనాలు వెలువడినప్పటికీ అధికారులు స్పందించకపోవడంపై బీజేపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు నాణ్యత లేని ఆహారం అందిస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో బీజేపీ మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్, మహిళా మోర్చా అధ్యక్షురాలు నాంపల్లి మమత గురుకుల పాఠశాలను పరిశీలించేందుకు వెళ్లారు. విద్యార్థులకు అందుతున్న ఆహారం నాణ్యత, అల్పాహారం అందించే సమయపాలన, పరిశుభ్రత తదితర అంశాలను తెలుసుకునేందుకు వెళ్లిన బీజేపీ నాయకులకు గురుకుల ప్రిన్సిపాల్ నుంచి సరైన స్పందన లభించలేదని వారు ఆరోపించారు. హెడ్ ఆఫీస్ పర్మిషన్ కావాలంటూ పాఠశాలలోకి అనుమతించకుండా వెనక్కి పంపించారని తెలిపారు.పత్రికల్లో విద్యార్థుల సమస్యలపై కథనాలు వచ్చినా సంబంధిత అధికారులు స్పందించకపోవడం పట్ల బీజేపీ నాయకులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, భవిష్యత్తుతో ముడిపడిన సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించాల్సి ఉండగా, నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. “అధికారుల నిర్లక్ష్యానికి గురుకుల విద్యార్థులే బలి కావాలా?” అని ప్రశ్నించారు.

గురుకులంలో విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యత, వంట సిబ్బంది పనితీరు, వంటశాల పరిశుభ్రత, అల్పాహారం-భోజన నాణ్యత, టెండర్ల కేటాయింపు తదితర అంశాలపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు, గురుకుల సొసైటీ ఉన్నతాధికారులు వెంటనే గురుకులాన్ని పరిశీలించాలని కోరారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని నాయకులు హెచ్చరించారు. విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, పత్రికల్లో వచ్చిన ఆరోపణలపై వాస్తవాలను వెలుగులోకి తీసుకువచ్చి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

దళిత బంధు నిధుల కోసం రిలే దీక్షలు

- **పెండింగ్ నిధులు వెంటనే విడుదల చేయాలి**

హుజూరాబాద్, సెప్టెంబర్ 12(తెలంగాణ ముచ్చట్లు): దళిత బంధు పథకం రెండో విడత నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ హుజూరాబాద్‌లో లబ్ధిదారులు రిలే నిరాహార దీక్షలకు సిద్ధమయ్యారు. అంబేద్కర్ చౌరస్తా వద్ద ఈ దీక్షలు నిర్వహించనున్నట్లు తెలంగాణ రక్షణ సేన నాయకులు తెలిపారు.

తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో నిర్వహించనున్న రిలే నిరాహార దీక్షకు సంబంధించిన గోడపత్రికను టీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ఎనుగు మల్లారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దళిత బంధు రెండో విడతకు సంబంధించిన నిధులు విడుదల కాకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.

ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్‌లో ఉన్న దళిత బంధు నిధులను విడుదల చేసి లబ్ధిదారులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తమ సమస్య పరిష్కార మయ్యే వరకు దశలవారీగా ఆందోళనలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

రిలే నిరాహార దీక్షలకు దళిత బంధు లబ్ధిదారులు, దళిత సంఘాల నాయకులు, యువత పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపసర్పంచుల జాయింట్ చెక్ పవర్ రద్దు చేయాలి

- **సర్పంచులకు పూర్తి పరిపాలనా అధికారాలు కల్పించాలని మంత్రి సీతక్కకు వినతి**

స్టేషన్ ఘనపూర్, సెప్టెంబర్ 12 (తెలంగాణ ముచ్చట్లు): గ్రామ పంచాయతీల్లో ఉపసర్పంచులకు ఉన్న జాయింట్ చెక్ పవర్‌ను రద్దు చేసి, ప్రజలచే ఎన్నికైన సర్పంచులకు పూర్తి పరిపాలనా, ఆర్థిక అధికారాలు కల్పించాలని కోరుతూ తెలంగాణ పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి సీతక్కకు వినతిపత్రం సమర్పించారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో మంత్రి సీతక్క నివాసంలో తెలంగాణ పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షులు చింపుల సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల సర్పంచుల సంఘాల అధ్యక్షులు మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా గ్రామ పంచాయతీల పరిపాలనలో ఉపసర్పంచుల జాయింట్ చెక్ పవర్ కారణంగా అభివృద్ధి పనులు, ఆర్థిక వ్యవహారాల నిర్వహణలో ఎదురవుతున్న ఇబ్బందులను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలచే నేరుగా ఎన్నికైన సర్పంచులకు పూర్తి అధికారాలు, బాధ్యతలు కల్పించడం ద్వారా గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా జరిగే అవకాశం ఉంటుందని వివరించారు. గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులు, నిధుల వినియోగం, పరిపాలనా నిర్ణయాల్లో జాప్యం లేకుండా ఉపసర్పంచుల జాయింట్ చెక్ పవర్‌ను రద్దు చేసి, సర్పంచులకు పూర్తి స్థాయి అధికారాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సీతక్కను కోరారు.ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు గుగులోత్ వినోద్ రవీందర్ నాయక్ పాల్గొన్నారు.

జమ్మికుంటలో నేడు మాదిగ ఆత్మీయ సభ

- **దళితబంధు రెండో విడత నిధులపై ప్రణవ్‌బాబు కీలక ప్రకటన**

జమ్మికుంట టౌన్ సెప్టెంబర్ 12 (తెలంగాణ ముచ్చట్లు): మాదిగ మహాశక్తి ఆధ్వర్యంలో దళితబంధు లబ్ధిదారుల సమావేశం, మాదిగ ఆత్మీయ సభ ఆదివారం జమ్మికుంట పట్టణంలోని ఎంఎన్ఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ సభకు దళితబంధు రెండో విడత నిధుల కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులతో పాటు మాదిగ కులస్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. దళితులకు దళితబంధు రెండో విడత నిధుల అంశంపై సభలో ప్రత్యేక ఆహ్వానితుడిగా హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఒడితల ప్రణవ్‌బాబు మాట్లాడి కీలక ప్రకటన చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దీంతో రెండో విడత దళిత బంధు నిధులపై ఆయన ఎలాంటి ప్రకటన చేస్తారనే అంశంపై ఆసక్తి నెలకొంది.

ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, ఎంఎంఎస్ వ్యవస్థాపకులు మోత్కుపల్లి నర్సింహులు ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. దీంతో సభకు మరింత ప్రాధాన్యత ఏర్పడింది.

హుజూరాబాద్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి మాదిగ కులస్తులు, దళితబంధు రెండో విడత లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

ఓటర్ల జాబితాపై ఆర్డీవో ఆరా..!

- **శ్రీరాములపల్లిలో ఎస్ఐఆర్ ప్రత్యేక ప్రచారాన్ని పరిశీలించిన జలకుమారి**

ఇల్లందకుంట, సెప్టెంబర్ 12 (తెలంగాణ ముచ్చట్లు): ఓటర్ల జాబితా పకడ్బందీగా రూపొందించడమే లక్ష్యంగా చేపట్టిన ఎస్ఐఆర్ ప్రత్యేక ప్రచార కార్యక్రమం కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలంలో కొనసాగుతోంది. ఇందులో భాగంగా శ్రీరాములపల్లి గ్రామంలోని పోలింగ్ కేంద్రాన్ని ఆర్డీవో జలకుమారి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.

పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ఆర్డీవో.. ఓటర్ల జాబితా పరిశీలన ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. ప్రత్యేక ప్రచార కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న కార్యక్రమాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఓటర్ల జాబితాలో పేర్ల పరిశీలన, మార్పులు-చేర్పులు, అభ్యంతరాల స్వీకరణ తదితర అంశాలపై అధికారులతో చర్చించారు.

ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి అంశాన్ని నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించాలని, అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో ఉండేలా అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని ఆర్డీవో సూచించినట్లు తెలిసింది. ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

ఈ సందర్భంగా శ్రీరాములపల్లి గ్రామ సర్పంచ్ గుత్తికొండ రమ్య ఆర్డీవో జలకుమారిని శాలువాతో సన్మానించారు.

కార్యక్రమంలో తహసీల్దార్ మనోజ్, ఎస్ఐ రంజిత్‌రెడ్డి, జీపీవో యాదగిరి, బీఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.

మాదిగ జర్నలిస్టులు గుర్రం జాషువాను ఆదర్శంగా తీసుకోవాలి



- **సమాజంతో పాటు జాతి చైతన్యం కోసం పనిచేయాలి**
- **మాజీ డిప్యూటీ సీఎం తాటికొండ రాజయ్య**
- **మీడియా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి**
- **టీఎంజేఎఫ్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు బూరుగుల నాగేందర్ మాదిగ**
- **అన్ని సంఘాలకు టీఎంజేఎఫ్ మద్దతుగా నిలవాలి**
- **సీనియర్ జర్నలిస్ట్ పురుషోత్తం**

హైదరాబాద్, ఆగస్టు 12 (తెలంగాణ ముచ్చట్లు): మాదిగ జర్నలిస్టులు మహాకవి గుర్రం జాషువా, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్, సదాలక్ష్మి వంటి మహనీయులను ఆదర్శంగా తీసుకుని సమాజంతో పాటు జాతి చైతన్యం కోసం పనిచేయాలని తెలంగాణ తొలి డిప్యూటీ సీఎం తాటికొండ రాజయ్య అన్నారు.కోటిలోని బీసీ సాధికార సంస్థ కాన్ఫరెన్స్ హాల్లో తెలంగాణ మాదిగ జర్నలిస్టు ఫోరం (టీఎంజేఎఫ్) రాష్ట్ర 3వ మహాసభలను శనివారం నిర్వహించారు. టీఎంజేఎఫ్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు బూరుగుల నాగేందర్ మాదిగ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి తాటికొండ రాజయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.అన్ని రంగాల్లో అణగారిన మాదిగ సమాజానికి మీడియా పరంగా సొంత గొంతుక అవసరమని రాజయ్య అన్నారు. సృష్టిలో మాదిగలే తొలి విలేకరులని, మాదిగ జర్నలిస్టులు సమాజంలో మేధావులుగా తమ బాధ్యతను గుర్తించి పనిచేయాలని సూచించారు.1994లో ఆవిర్భవించిన ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి మాదిగలే పురుడు పోశారని, తెలంగాణ ఉద్యమాన్ని ఉవ్వెత్తున నడిపించడంలోనూ మాదిగలు కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం గజ్జ కట్టి ఆడింది, డప్పు కొట్టింది, పాట పాడింది, పాట రాసింది మెజారిటీగా మాదిగలేనని అన్నారు.

మాదిగ సమాజంలో పుట్టి వివిధ రంగాల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించిన వ్యక్తుల చరిత్రను డాక్యుమెంట్ చేయాల్సిన బాధ్యత మాదిగ జర్నలిస్టులపై ఉందన్నారు. “ఎవరి చరిత్ర వారే రాసుకోవాలి. ఇతరులు రాస్తే కల్పితాల బారిన పడే అవకాశం ఉంటుంది” అని అన్నారు.మాదిగ జర్నలిస్టులు ప్రశ్నించే తత్వంతో పనిచేయాలని, అవకాశం, సందర్భాన్ని బట్టి జాతి పక్షాన గొంతెత్తాలని రాజయ్య సూచించారు.సామాజిక న్యాయం, సరైన వాటా కోసం మాదిగలు నిరంతరం ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. మాదిగల హక్కుల కోసం తెలంగాణ మాదిగ జర్నలిస్టు ఫోరం ఏర్పాటు చేయడం అభినందనీయమని, సంఘానికి తన వంతు అండదండలు అందిస్తానని హామీ ఇచ్చారు.

మీడియా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

మాదిగ జర్నలిస్టుల అభివృద్ధి, మీడియా రంగంలో అవకాశాల కల్పన కోసం ప్రత్యేకంగా మీడియా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని టీఎంజేఎఫ్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు బూరుగుల నాగేందర్ మాదిగ కోరారు. మాదిగ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు.

సీనియర్ జర్నలిస్ట్ పురుషోత్తం మాట్లాడుతూ టీఎంజేఎఫ్ అన్ని సామాజిక సంఘాలు, ప్రజా ఉద్యమాలకు మద్దతుగా నిలవాలని సూచించారు. జర్నలిస్టులు తమ వృత్తి బాధ్యతలను నిర్వర్తిస్తూనే సామాజిక చైతన్యం కోసం కృషి చేయాలని అన్నారు.

ఈ మహాసభలో రచయిత పాపని నాగరాజు, సీనియర్ జర్నలిస్ట్ ఇంద్రవెల్లి రమేష్ ప్రసంగించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు పాల్వాయి బాలయ్య, గౌరవ సలహాదారు సుంచు లింగయ్య, ఉపాధ్యక్షులు పానుగంటి సురేందర్, కాటేపగ హాన్సేన్, ప్రేమ్ కుమార్, పసుల తిరుపతి, కార్యదర్శులు సుక్క అశోక్, దుబ్బా నాగేష్, రాష్ట్ర కోశాధికారి కుమ్మరి ముఖేష్, రాష్ట్ర నాయకులు సదానందం, మోహన్, అనిల్, శ్రీనివాస్, ఒగ్గు సోమయ్య, మహేష్, దాసు, భిక్షపతి, గంట వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కొత్త సీఐ కొండ్రు శ్రీనివాస్‌ను కలిసిన దండేపల్లి ప్రజాప్రతినిధులు

- **కొత్త సీఐ కొండ్రు శ్రీనివాస్‌ను కలిసిన దండేపల్లి ప్రజాప్రతినిధులు**

ఎల్కతుర్తి, సెప్టెంబర్ 12 (తెలంగాణ ముచ్చట్లు): ఎల్కతుర్తి పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కొండ్రు శ్రీనివాస్‌ను దండేపల్లి గ్రామ సర్పంచ్ గోలిపెల్లి సంపత్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఐ కొండ్రు శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలిపారు. సర్పంచ్ గోలిపెల్లి సంపత్‌తో పాటు నూతనంగా ఎన్నికైన పీఏసీఎస్ మెంబర్ చిర్ర రాజయ్య, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు సీఐను కలిసి పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో శాంతిభద్రతలు, ప్రజా సమస్యలు, పోలీస్ శాఖ అందిస్తున్న సేవలపై చర్చించారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా శాంతియుత వాతావరణం కొనసాగేందుకు పోలీస్ శాఖతో ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తామని వారు తెలిపారు. ప్రజలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని కోరారు. ఈ సందర్భంగా సీఐ కొండ్రు శ్రీనివాస్ ప్రజాప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు, ప్రజాప్రతినిధులు పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మించారు.. రైతుల సమస్యను మరిచారు!

- **ఎన్‌హెచ్–563పై రైతుల ధర్నా.. అండర్‌పాస్ కోసం ఆందోళన**

ఎల్కతుర్తి, సెప్టెంబర్ 12 (తెలంగాణ ముచ్చట్లు): హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని కోతులనడుమ గ్రామం వద్ద ఎన్‌హెచ్-563 రోడ్డు నిర్మాణ పనులు పూర్తయినా రైతుల సమస్యలకు మాత్రం పరిష్కారం లభించలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి అండర్‌పాస్ నిర్మించాలని డిమాండ్ చేస్తూ రైతులు, గ్రామస్తులు శనివారం ఎన్‌హెచ్-563పై ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా రైతులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ తమ డిమాండ్‌ను ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఎన్‌హెచ్-563 నిర్మాణంతో గ్రామానికి చెందిన రైతులు తమ వ్యవసాయ భూములు, బావులు, పశువుల వద్దకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

రోడ్డు దాటి వెళ్లే అవకాశం లేకపోవడంతో రెండు నుంచి మూడు కిలోమీటర్లు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

వ్యవసాయ పనుల కోసం ప్రతిరోజూ రాకపోకలు సాగించే రైతులకు ఈ పరిస్థితి తీవ్ర ఇబ్బందికరంగా మారిందని పేర్కొన్నారు. రోడ్డు నిర్మాణం చేపట్టే సమయంలోనే రైతుల రాకపోకలకు అనుకూలంగా అండర్‌పాస్ ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ, తమ సమస్యను అధికారులు పట్టించుకోలేదని ఆరోపించారు.

సొసైటీ బ్యాంకు మాజీ అధ్యక్షుడు శీపతి రవీంద్రగౌడ్‌తో పాటు పలువురు రైతులు, గ్రామస్తులు ధర్నాలో పాల్గొన్నారు. గ్రామ సమీపంలో తప్పనిసరిగా అండర్‌పాస్ నిర్మించాలని, రైతుల సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అండర్‌పాస్ మంజూరు చేసి నిర్మాణ పనులు చేపట్టకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

సమాచారం అందుకున్న ఎల్కతుర్తి సీఐ శ్రీను ఆధ్వర్యంలో ఎస్ఐ నర్సింహారావుతో పాటు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పర్యవేక్షించారు. సుమారు రెండు గంటల పాటు ధర్నా కొనసాగడంతో ఎన్‌హెచ్-563పై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు, ఎన్‌హెచ్ అధికారులు వెంటనే గ్రామాన్ని పరిశీలించి అండర్‌పాస్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. అభివృద్ధి పేరుతో రోడ్డు నిర్మించినా, ఆ రహదారి కారణంగా రైతుల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడకుండా ప్రభుత్వం తక్షణమే పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.

శ్రీ ఆదర్శలో పర్యావరణహిత గణపయ్యలు

- **108 గృహాల లబ్ధిదారుల ఎంపిక**
- **పారదర్శకంగా డ్రా నిర్వహించిన అధికారులు**
- **రెండు దశల్లో కేటాయింపు ప్రక్రియ**

ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 12(తెలంగాణ ముచ్చట్లు): పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ నాగులవంచ శ్రీ ఆదర్శ హైస్కూల్ విద్యార్థులు వినూత్నంగా మట్టి, పిండి, సహజ పదార్థాలతో పర్యావరణహిత వినాయక విగ్రహాలను రూపొందించి శనివారం ప్రదర్శించారు. రసాయన రంగులు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌కు దూరంగా ఉండేలా సహజ పదార్థాలతో విగ్రహాలను తయారు చేసి తమలోని సృజనాత్మకతను చాటుకున్నారని పాఠశాల కరస్పాండెంట్ బోడేపూడి కిరణ్ పేర్కొన్నారు. వినాయక చవితి సందర్భంగా పర్యావరణానికి హాని కలిగించని మట్టి, సహజ పదార్థాలతో తయారు చేసిన విగ్రహాలను వినియోగించడం ద్వారా చెరువులు, కాలువలు, నీటి వనరులను కాలుష్యం నుంచి కాపాడవచ్చని విద్యార్థులకు వివరించారు. పర్యావరణహిత విగ్రహాల వినియోగం ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలని సూచించారు. విద్యార్థులు రూపొందించిన పర్యావరణహిత వినాయక విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పాఠశాల్లో మూడవ తరగతి చదువుతున్న విద్యార్థులు నేతి జశ్విత, కోపూరి నయిన, జల్లా వీక్షశ్రీ, కస్తూరి లీలాకృతి, బంధం శాంత కుమార్, ఎరదేశి హిమబిందు తయారుచేసిన పర్యావరణహిత విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా ఆయా విద్యార్థులను పాఠశాల సిబ్బంది అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ చావా అరుణ్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు డ్రా

- **108 గృహాల లబ్ధిదారుల ఎంపిక**
- **పారదర్శకంగా డ్రా నిర్వహించిన అధికారులు**
- **రెండు దశల్లో కేటాయింపు ప్రక్రియ**

జనగామ, సెప్టెంబర్ 12 (తెలంగాణ ముచ్చట్లు) ఘనపూర్ (స్టేషన్) నియోజకవర్గ పరిధిలోని ఘనపూర్ (స్టేషన్), లింగాల ఘనపురం, జఫర్గడ్ మండలాల్లో నిర్మించిన 108 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం శనివారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో డ్రా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధ్యక్షతన, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్ సమక్షంలో ఈ ప్రక్రియ పారదర్శకంగా చేపట్టారు. అర్హులైన నిరుపేద కుటుంబాలకు న్యాయంగా గృహాలు కేటాయించడమే ప్రభుత్వ లక్ష్యమని అధికారులు తెలిపారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లబ్ధిదారుల ఎంపిక కోసం ఇందిరమ్మ ఇళ్ల ఎల్2 జాబితా, ప్రజావాణి దరఖాస్తులు, ప్రజాప్రతినిధులు అందించిన అర్హుల వివరాలను ఏకీకృతం చేసి తుది జాబితా రూపొందించినట్లు చెప్పారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సమాన అవకాశం కల్పించేందుకు డ్రా విధానాన్ని అనుసరించినట్లు వివరించారు. మొత్తం ప్రక్రియను వీడియో చిత్రీకరణతో పాటు జిల్లా స్థాయి కమిటీ పర్యవేక్షణలో నిర్వహించినట్లు తెలిపారు. డ్రా ప్రక్రియ రెండు దశల్లో కొనసాగుతుందని అధికారులు వెల్లడించారు. మొదటి దశలో అర్హుల ఎంపిక, రెండో దశలో ఎంపికైన వారికి ప్లాట్ల కేటాయింపు జరుగుతుందని పేర్కొన్నారు. డ్రాలో ఎంపికైన కుటుంబాలకు తాత్కాలిక కేటాయింపు ఉత్తర్వులు జారీ చేయడంతో పాటు, మండల స్థాయి బృందాలు క్షేత్రస్థాయిలో అర్హతలను పరిశీలిస్తాయని చెప్పారు. అర్హతలు నిర్ధారించిన తర్వాత తుది ఉత్తర్వులు జారీ చేసి గృహాల స్వాధీనం కల్పించనున్నట్లు తెలిపారు.

ఘనపూర్ (స్టేషన్) మండలం పామ్నూర్ గ్రామ పంచాయతీలో మొత్తం 57 మంది అర్హుల జాబితా సిద్ధం చేయగా, అందులో 40 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు 40 మంది లబ్ధిదారులను డ్రా ద్వారా ఎంపిక చేశారు. అదనంగా 8 మందిని వేచివున్న జాబితాలో చేర్చారు. లింగాల ఘనపురం మండలం కళ్లెం గ్రామ పంచాయతీలో 65 మంది అర్హుల జాబితా సిద్ధం చేసి, 30 ఇళ్లకు 30 మందిని ఎంపిక చేయడంతో పాటు 6 మందిని వేచివున్న జాబితాలో ఉంచారు.

జఫర్గడ్ మండలం తిమ్మంపేట గ్రామ పంచాయతీలో 34 మంది అర్హుల జాబితా నుంచి 25 మందిని ఇళ్ల కోసం ఎంపిక చేసి, 5 మందిని వేచివున్న జాబితాలో చేర్చారు. అలాగే తమ్మడపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని వావిలాల ప్రాంతంలో ఉన్న 13 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు 13 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి, మరో 5 మందిని వేచివున్న జాబితాలో చేర్చినట్లు అధికారులు వెల్లడించారు. ఎంపికైన లబ్ధిదారుల జాబితాలను గ్రామ పంచాయతీలు, మున్సిపల్ కార్యాలయాలు, తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రదర్శించడంతో పాటు జిల్లా వెబ్‌సైట్‌లో కూడా అందుబాటులో ఉంచనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఘనపూర్ (స్టేషన్) ఆర్డీవో కిరణ్ ప్రకాష్, ఆడిట్ అధికారి దేవేందర్, లింగాల ఘనపురం, జఫర్గడ్, ఘనపూర్ (స్టేషన్) తహసీల్దార్లు స్వప్న, శ్రీనివాస్, ఆండాలు తదితర అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక
ఆదివారం - 13 - సెప్టెంబర్ 2026
వరంగల్ 07

ఫారెక్స్ నిల్వల్లో భారత్ సరికొత్త రికార్డు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 12 (తెలంగాణ ముచ్చట్లు): భారత ఆర్థిక వ్యవస్థ మరో కీలక మైలురాయిని అందుకుంది. దేశ విదేశీ మారక నిల్వలు (ఫారెక్స్ రిజర్వులు) సరికొత్త రికార్డు స్థాయికి చేరాయి. దీంతో అత్యధిక విదేశీ మారక నిల్వలు కలిగిన దేశాల జాబితాలో రష్యాను వెనక్కి నెట్టి భారత్ నాలుగో స్థానానికి చేరింది. బ్లూమ్‌బర్గ్ గణాంకాల ప్రకారం సెప్టెంబరు 4తో ముగిసిన వారంలో భారత్ ఫారెక్స్ నిల్వలు ఏకంగా 44.9 బిలియన్ డాలర్లు పెరిగి 785.7 బిలియన్ డాలర్లకు చేరాయి.

రష్యాను వెనక్కి నెట్టిన భారత్

భారీగా పెరిగిన విదేశీ మారక నిల్వలతో భారత్ ఇప్పటివరకు నాలుగో స్థానంలో ఉన్న రష్యాను అధిగమించింది. ప్రస్తుతం ఈ జాబితాలో చైనా, జపాన్, స్విట్జర్లాండ్ మాత్రమే భారత్ కంటే ముందున్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థకు ఇది కీలక పరిణామంగా ఆర్థిక వర్గాలు భావిస్తున్నాయి.

ఆర్‌బీఐ ప్రత్యేక పథకం ప్రభావం

ఈ భారీ పెరుగుదలకు ఆర్‌బీఐ చేపట్టిన ప్రత్యేక మారక పథకానికి వచ్చిన స్పందనే ప్రధాన కారణంగా నిలిచింది. జూన్ 8న ప్రారంభించిన విదేశీ కరెన్సీ నాన్‌రెసిడెంట్ బ్యాంకు డిపాజిట్ల ప్రత్యేక మారక పథకం ద్వారా విదేశాల నుంచి భారీగా డాలర్లు దేశంలోకి వచ్చాయి. కేవలం 11 వారాల్లోనే ఈ పథకం ద్వారా 73 బిలియన్ డాలర్ల విదేశీ నిధులు సమకూరినట్లు సమాచారం. నిర్దేశించిన లక్ష్యం గడువు కంటే ముందే చేరుకోవడంతో ఆర్‌బీఐ ఈ పథకాన్ని సెప్టెంబరు 30కి బదులుగా ఆగస్టు 31నే ముగించింది. ఇదే సమయంలో అంతర్జాతీయంగా బంగారం ధరలు తగ్గడంతో దేశ పసిడి నిల్వల విలువ 2.59 బిలియన్ డాలర్లు తగ్గింది. అయినప్పటికీ డాలర్ల ప్రవాహం భారీగా ఉండటంతో మొత్తం విదేశీ మారక నిల్వలు గణనీయంగా పెరిగాయి. ఈ నిల్వలు పెరగడం వల్ల రూపాయి విలువలో హెచ్చుతగ్గులు వచ్చినప్పుడు జోక్యం చేసుకుని స్థిరీకరించేందుకు ఆర్‌బీఐకి మరింత బలం చేకూరుతుందని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు.

గణేశ్ చతుర్థికి అమెజాన్ ప్రత్యేక ఆఫర్లు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 12 (తెలంగాణ ముచ్చట్లు): గణేశ్ చతుర్థి పండుగను పురస్కరించుకుని ప్రముఖ ఈకామర్స్ సంస్థ అమెజాన్ ప్రత్యేక విక్రయాలను ప్రారంభించింది. పర్యావరణహిత గణేశ విగ్రహాలు, పూజా సామగ్రి, సంప్రదాయ దుస్తులు, గృహ అలంకరణ వస్తువులు, స్వీట్లపై భారీ రాయితీలను అందిస్తోంది. పండుగ అవసరాలను సులభంగా కొనుగోలు చేసేందుకు ప్రత్యేకంగా కృత్రిమ మేధ ఆధారిత 'గణేశ్ చతుర్థి స్టోర్'ను అందుబాటులోకి తీసుకొచ్చింది.

80 శాతం వరకు రాయితీలు

పండుగకు అవసరమైన గృహోపకరణాలు, సంప్రదాయ దుస్తులు, అలంకరణ వస్తువులు, పూజా సామగ్రిపై దాదాపు 50 నుంచి 80 శాతం వరకు రాయితీలు లభిస్తున్నట్లు సంస్థ తెలిపింది. ప్రధాన సభ్యులకు అదనంగా 5 శాతం వరకు తగ్గింపు అందించే అవకాశం ఉంది. పండుగ కొనుగోళ్లను ఒకే వేదికపై పూర్తి చేసుకునేలా వివిధ రకాల ఉత్పత్తులను అందుబాటులో ఉంచింది.

అమెజాన్ నౌ సేవ ద్వారా దేశవ్యాప్తంగా 55కు పైగా ప్రధాన నగరాల్లో పూజా సామగ్రి, పండుగకు అవసరమైన నిత్యావసరాలను వేగంగా డెలివరీ చేసే సదుపాయాన్ని కల్పిస్తోంది. దీంతో చివరి నిమిషంలోనూ పండుగకు కావాల్సిన వస్తువులను ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసుకునే అవకాశం వినియోగదారులకు లభించనుంది.

కృత్రిమ మేధతో మరింత సులభంగా కొనుగోలు

పండుగ సందర్భంగా వ్యక్తిగతీకరించిన కొనుగోలు అనుభవాన్ని అందించేందుకు అమెజాన్ కృత్రిమ మేధ ఆధారిత సాధనాలను కూడా అందుబాటులోకి తీసుకొచ్చింది. 'రూఫస్' అనే కృత్రిమ మేధ సహాయకుడి ద్వారా వినియోగదారులు తమ బడ్జెట్‌కు అనుగుణంగా ఉత్పత్తులను వెతుక్కోవచ్చు. 'లెన్స్ ఏఐ' సాయంతో ఫొటో తీసి అదే తరహా ఉత్పత్తులను గుర్తించి కొనుగోలు చేసే అవకాశం ఉంది. అలాగే రూఫస్‌లోని ధరల చరిత్ర సదుపాయం ద్వారా గత 30 నుంచి 90 రోజుల ధరల మార్పులను పరిశీలించి కొనుగోలు నిర్ణయం తీసుకోవచ్చు.

పహల్గాం దాడిని ఖండించిన బ్రిక్స్

- ఉగ్రవాదంపై కఠిన వైఖరిని పునరుద్ఘాటించిన సభ్య దేశాలు
- న్యూఢిల్లీ డిక్లరేషన్‌లో కీలక తీర్మానం
- ఉగ్రవాదానికి అన్ని రూపాల్లో వ్యతిరేకంగా ఉమ్మడి పోరాటానికి ప్రతిజ్ఞ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12 (తెలంగాణ ముచ్చట్లు): 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు సందర్భంగా సభ్య దేశాలు ఉగ్రవాదంపై తమ కఠిన వైఖరిని మరోసారి స్పష్టం చేశాయి. సెప్టెంబర్ 12న ఆమోదించిన 'న్యూఢిల్లీ డిక్లరేషన్'లో ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని ప్రకటించాయి. ప్రపంచ శాంతి, భద్రతలకు ఉగ్రవాదం అతిపెద్ద ముప్పుగా మారిందని పేర్కొంటూ, అన్ని రూపాల్లోని ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని నిర్ణయించాయి. ఈ సందర్భంగా 2025 ఏప్రిల్ 22న జమ్ముకశ్మీర్‌లోని పహల్గాం వద్ద జరిగిన ఉగ్రదాడిని బ్రిక్స్ దేశాల నేతలు తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనలో 26 మంది ప్రాణాలు కోల్పోవడం, పలువురు గాయపడటం పట్ల సంతాపం వ్యక్తం చేశారు. నిరపరాధులపై జరిగిన ఈ దాడి అత్యంత దారుణమైందని పేర్కొంటూ బాధిత కుటుంబాలకు తమ సానుభూతిని తెలియజేశారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా అది మానవత్వానికి వ్యతిరేకమైన నేరమని స్పష్టం చేశారు.

ఉగ్రవాద చర్యలు ఎక్కడ, ఎప్పుడు, ఎవరు, ఏ ఉద్దేశంతో చేపట్టినా అవి పూర్తిగా ఖండనీయమేనని డిక్లరేషన్‌లో పేర్కొన్నారు. ఉగ్రవాదానికి నిధులు సమకూర్చడం, శిక్షణ ఇవ్వడం, సురక్షిత ఆశ్రయాలు కల్పించడం, సరిహద్దులు దాటి కార్యకలాపాలు నిర్వహించడం వంటి చర్యలను కూడా తీవ్రంగా పరిగణిస్తామని తెలిపారు. ఉగ్రవాద సంస్థలు మరియు వాటి మద్దతుదారులపై సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సభ్య దేశాలు నిర్ణయించాయి. ఉగ్రవాద నిరోధక చర్యల్లో ద్వంద్వ ప్రమాణాలకు తావులేదని బ్రిక్స్ నేతలు స్పష్టం చేశారు. ఉగ్రవాదాన్ని ఏ మతానికీ, జాతికీ, జాతీయతకీ లేదా నాగరికతకీ ముడిపెట్టరాదని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా శాంతి, సామరస్యాలను కాపాడేందుకు అన్ని దేశాలు సమాన దృక్పథంతో వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఉగ్రవాదాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించరాదని కూడా సూచించారు.

ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడేవారిని, వారికి మద్దతు ఇచ్చే వ్యక్తులు లేదా సంస్థలను జాతీయ, అంతర్జాతీయ చట్టాల ప్రకారం బాధ్యులను చేయాలని డిక్లరేషన్‌లో పేర్కొన్నారు. నేరస్థులను న్యాయస్థానాల ముందు నిలబెట్టి తగిన శిక్షలు విధించేలా దేశాలు పరస్పరం సహకరించుకోవాలని నిర్ణయించారు. యువతలో పెరుగుతున్న తీవ్రవాద భావజాలాన్ని అరికట్టేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని కూడా సూచించారు.

అయితే పహల్గాం ఉగ్రదాడి వెనుక ఏ దేశం లేదా సంస్థ ప్రమేయం ఉందనే విషయాన్ని న్యూఢిల్లీ డిక్లరేషన్‌లో ప్రత్యేకంగా ప్రస్తావించలేదు. గతంలో 2025 బ్రిక్స్ రియో డిక్లరేషన్, షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) టియాంజిన్ సమావేశాల్లో కూడా ఇదే తరహా ఖండన తీర్మానాలు వెలువడ్డాయి. ఉగ్రవాదంపై ఉమ్మడి పోరాటం కొనసాగించాలనే సంకల్పంతో బ్రిక్స్ దేశాలు మరోసారి ప్రపంచానికి స్పష్టమైన సందేశాన్ని ఇచ్చాయి.

నౌకల మరమ్మతు రంగానికి కొత్త ఊపు

- కొచ్చిన్ షిప్‌యార్డ్, డ్రైడాక్స్ వరల్డ్ సంయుక్త సంస్థ ఏర్పాటు
- అంతర్జాతీయ నౌకల మరమ్మతు కేంద్రం విస్తరణకు నిర్ణయం
- భారత్-యూఏఈ సముద్ర సంబంధాలకు మరో మైలురాయి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12 (తెలంగాణ ముచ్చట్లు): భారతదేశ నౌకల మరమ్మతు రంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్, డ్రైడాక్స్ వరల్డ్ సంస్థలు సంయుక్తంగా కొత్త సంస్థను ఏర్పాటు చేశాయి. ఇరు సంస్థలు సమాన భాగస్వామ్యంతో ఈ సంయుక్త సంస్థను నిర్వహించనున్నాయి. నౌకల మరమ్మతు సేవల విస్తరణతో పాటు దేశీయ, అంతర్జాతీయ అవసరాలను తీర్చడమే దీని ప్రధాన లక్ష్యంగా ఉంది. ఈ సంయుక్త సంస్థ ద్వారా కొచ్చిన్‌లో ఉన్న అంతర్జాతీయ నౌకల మరమ్మతు కేంద్రం నిర్వహణ, విస్తరణ పనులు చేపట్టనున్నారు. పెరుగుతున్న ప్రాంతీయ, ప్రపంచ డిమాండ్‌కు అనుగుణంగా ఆధునిక సౌకర్యాలను అభివృద్ధి చేయనున్నారు. దీంతో భారతదేశం నౌకల మరమ్మతు రంగంలో మరింత కీలక కేంద్రంగా ఎదిగే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.

సముద్ర రవాణా, వాణిజ్య రంగాల్లో వేగంగా పెరుగుతున్న అవకాశాలను దృష్టిలో ఉంచుకుని ఈ భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకొచ్చారు. నౌకల మరమ్మతు, నిర్వహణ సేవల సామర్థ్యాన్ని పెంచడం ద్వారా విదేశీ నౌకలను కూడా ఆకర్షించే లక్ష్యంతో ప్రణాళికలు రూపొందించారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని భావిస్తున్నారు. కేంద్ర ఓడరేవులు, నౌకాయాన శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ ఈ భాగస్వామ్యాన్ని స్వాగతించారు. కొచ్చిన్ షిప్‌యార్డ్, డ్రైడాక్స్ వరల్డ్ మధ్య కుదిరిన ఈ ఒప్పందం భారత నౌకల మరమ్మతు వ్యవస్థను బలోపేతం చేయడంలో కీలక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఇది దేశ సముద్ర ఆర్థిక వ్యవస్థకు మరింత బలం చేకూరుస్తుందని అన్నారు. భారత్‌యూఏఈ మధ్య శతాబ్దాలుగా కొనసాగుతున్న వాణిజ్య, వ్యాపార, ప్రజల మధ్య సంబంధాలకు ఈ భాగస్వామ్యం ప్రతీకగా నిలుస్తుందని సోనోవాల్ తెలిపారు. ఇరు దేశాల మధ్య సముద్ర రంగ సహకారం మరింత బలోపేతం కావడానికి ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు. వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత విస్తరించే అవకాశాలను కూడా ఈ ఒప్పందం కల్పిస్తుందని అభిప్రాయపడ్డారు.

ఈ సంయుక్త సంస్థ ఏర్పాటు ద్వారా భారత దేశం ప్రపంచ నౌకల మరమ్మతు రంగంలో తన స్థానాన్ని మరింత బలపరుచుకునే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. ఆధునిక సాంకేతికత, అంతర్జాతీయ ప్రమాణాల సేవలతో దేశీయ నౌకాయాన రంగానికి కొత్త అవకాశాలు లభించనున్నాయి. భవిష్యత్తులో మరిన్ని పెట్టుబడులు, విస్తరణ కార్యక్రమాలకు ఈ భాగస్వామ్యం మార్గం సుగమం చేయనుందని అంచనా వేస్తున్నారు.

నదిని మార్చిన యువకుడి అచంచల సంకల్పం

- ఒంటరి పోరాటంతో అజ్నార్ నదికి కొత్త జీవం
- నెదర్లాండ్స్ ఉద్యోగ అవకాశాన్ని తిరస్కరించిన బిట్టు

రాజ్‌గఢ్, సెప్టెంబర్ 12 (తెలంగాణ ముచ్చట్లు): మధ్యప్రదేశ్‌కు చెందిన 20 ఏళ్ల యువకుడు బిట్టు తబాహీ సంకల్పం ఉంటే ఒక్క వ్యక్తి కూడా సమాజంలో ఎంతటి మార్పు తీసుకురాగలడో నిరూపించాడు. ప్రభుత్వ సహాయం, పెద్ద సంస్థల మద్దతు లేకుండానే అతను నెలల తరబడి శ్రమించి తీవ్ర కాలుష్యానికి గురైన అజ్నార్ నదిని శుభ్రం చేసి దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకున్నాడు. రాజ్‌గఢ్ జిల్లా బియావరా పట్టణానికి చెందిన ఈ బీఎస్సీ విద్యార్థి చేసిన కృషి ప్రస్తుతం యువతకు ఆదర్శంగా నిలుస్తోంది. పర్యావరణ పరిరక్షణ కోసం అతను చేపట్టిన ఈ కార్యక్రమం సామాజిక బాధ్యతకు నిదర్శనంగా మారింది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా అజ్నార్ నది శుభ్రత కార్యక్రమాన్ని ప్రారంభించిన బిట్టు, ఎవరి కోసం ఎదురు చూడకుండా స్వయంగా పనిలోకి దిగాడు. నదిలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారాన్ని తొలగిస్తూ రోజులు, వారాలు, నెలలు గడిపాడు. ఈ క్రమంలో తన సొంత డబ్బుతోనే అవసరమైన సామగ్రిని సమకూర్చుకుని నదిని శుభ్రపరిచే పనిని కొనసాగించాడు. అతని అంకితభావం వల్ల ఒకప్పుడు చెత్తతో నిండిపోయిన నది క్రమంగా స్వచ్ఛమైన రూపాన్ని సంతరించుకుంది.నది శుభ్రతకు ముందు, తర్వాత తీసిన ఫొటోలు మరియు వీడియోలను బిట్టు సోషల్ మీడియాలో పంచుకోవడంతో అవి విస్తృతంగా వైరల్ అయ్యాయి. నదిలో చోటుచేసుకున్న మార్పును చూసిన నెటిజన్లు ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ అతని కృషిని కొనియాడారు. దేశంలోని వివిధ ప్రాంతాల ప్రజలు అతనికి అభినందనలు తెలియజేయడమే కాకుండా, పర్యావరణ పరిరక్షణ కోసం ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని జరగాలని ఆకాంక్షించారు. సోషల్ మీడియా ద్వారా బిట్టు పేరు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందింది.బిట్టు చేసిన ఈ విశేష సేవ అంతర్జాతీయ స్థాయిలో కూడా గుర్తింపు తెచ్చిపెట్టింది. సముద్రాలు మరియు జలవనరుల శుభ్రత కోసం ప్రపంచవ్యాప్తంగా పనిచేస్తున్న 'ది ఓషన్ క్లీనప్' సంస్థ అతనికి ఉద్యోగ అవకాశాన్ని అందించింది. అయితే, విదేశీ ఉద్యోగం ద్వారా వ్యక్తిగతంగా ఎదగడం కంటే తన సేవలు దేశానికే అవసరమని భావించిన బిట్టు ఆ అవకాశాన్ని తిరస్కరించడం విశేషంగా మారింది. అతని నిర్ణయం దేశభక్తి, సామాజిక నిబద్ధతకు ప్రతీకగా ప్రశంసలు అందుకుంటోంది.తాజాగా విడుదల చేసిన ఓ వీడియోలో బిట్టు తనకు మద్దతు తెలిపిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశాడు. అజ్నార్ నది శుభ్రతతో తన ప్రయాణం ముగియలేదని, దేశంలోని ఇతర నదులు, కాలువలు, చెత్తతో నిండిపోయిన బహిరంగ ప్రదేశాలను కూడా శుభ్రం చేయాలనే సంకల్పంతో ఉన్నట్లు ప్రకటించాడు. "తర్వాత ఏ రాష్ట్రానికి రావాలి? ఎక్కడ శుభ్రం చేయాలి?" అంటూ దేశ ప్రజలకే నిర్ణయం వదిలిపెట్టడం ద్వారా తన తదుపరి కార్యక్రమంపై ఆసక్తిని పెంచాడు.

సీఎస్కేలో ధోనీ వాటాలపై క్లారిటీ

చెన్నై, సెప్టెంబరు 12 (తెలంగాణ ముచ్చట్లు): చెన్నై సూపర్ కింగ్స్ ఫ్రాంచైజీలో మహేంద్ర సింగ్ ధోనీ వాటాలు కోరారంటూ వచ్చిన ప్రచారంపై యాజమాన్యం స్పష్టత ఇచ్చింది. ధోనీ నుంచి ఫ్రాంచైజీలో వాటాలు కొనుగోలు చేయాలన్న ప్రతిపాదన తమకు రాలేదని సీఎస్కే వర్గాలు వెల్లడించాయి. ఈ అంశంపై ధోనీతో ఎలాంటి చర్చలు జరగలేదని స్పష్టం చేశాయి.

ధోనీకి ఇప్పటికే కొన్ని షేర్లు

గతంలో సీఎస్కే షేర్లు ప్రైవేటు విక్రయానికి అందుబాటులో ఉన్న సమయంలో ధోనీ కొన్ని షేర్లను కొనుగోలు చేసిన విషయం వాస్తవమేనని ఫ్రాంచైజీ వర్గాలు తెలిపాయి. బహిరంగ మార్కెట్‌లో కాకుండా ప్రైవేటుగా విక్రయించే ఈ షేర్లలో ధోనీకి లక్షకు పైగా షేర్లు ఉన్నట్లు సమాచారం. అయితే మొత్తం ఫ్రాంచైజీ వాటాతో పోలిస్తే ఇది చాలా స్వల్ప భాగమేనని పేర్కొన్నాయి. ప్రస్తుతం శ్రీనివాసన్ కుటుంబం వద్ద 55 శాతానికి పైగా ప్రైవేటు వాటాలు ఉన్నట్లు తెలుస్తోంది.

కొత్త కోచ్ ఎంపికలో కీలక పాత్ర

అమెరికా పర్యటనలో ఉన్న ధోనీ సెప్టెంబరు 22 నాటికి భారత్‌కు తిరిగి రానున్నట్లు సమాచారం. ఆయన రాక తర్వాత ఐపీఎల్ 2027 వేలం, ఆటగాళ్ల బదిలీలు, జట్టు కూర్పుపై సీఎస్కే యాజమాన్యం కీలక సమావేశం నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా కొత్త ప్రధాన కోచ్ ఎంపికలో ధోనీ అభిప్రాయం కీలకం కానుంది. ఓ విదేశీ దిగ్గజ ఆటగాడిని కోచ్‌గా నియమించే అవకాశాలపై కూడా చర్చ జరుగుతున్నట్లు సమాచారం.

బంధం యథావిధిగానే..

ధోనీకి సీఎస్కేతో ఉన్న అనుబంధంపై వస్తున్న ఊహాగానాలకు తాజా స్పష్టతతో తెరపడినట్లయింది. వాటాల వ్యవహారంపై ఎలాంటి కొత్త ప్రతిపాదన లేదని యాజమాన్యం తేల్చిచెప్పింది. సెప్టెంబరు చివరి వారంలో జరగనున్న కీలక సమావేశం తర్వాత కొత్త కోచ్, జట్టు భవిష్యత్ ప్రణాళికలపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.



తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

నా కాడెడ్ల గోడు!

ముక్కుకు సిక్కెం కట్టి
పగ్గాలతో పట్టి
గుంజినా
బాధ పడని నా ఎడ్లు

పడావుపడ్డ గుంజల్ని
కూలబడ్డ కొట్టాన్ని
జూసి
తల్లడిల్లుతున్నయ్

అయిలి సంతోష్
– రచయిత

‘రామ్-సంయుక్త’ జోడీ.. కొత్త ప్రయోగానికి శ్రీకారం

హైదరాబాద్, సెప్టెంబరు 12 (తెలంగాణ ముచ్చట్లు): ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని కథానాయకుడిగా నటిస్తూ, తొలిసారి దర్శకత్వ బాధ్యతలు చేపడుతున్న ప్రతిష్టాత్మక చిత్రంలో కథానాయికగా సంయుక్త ఎంపికైంది. సంయుక్త పుట్టినరోజు సందర్భంగా చిత్రబృందం ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించింది. రామ్, సంయుక్త జంటగా నటిస్తున్న తొలి చిత్రం కావడంతో ఈ కొత్త కలయికపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది.

సంయుక్తకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ.. ఆమెను తమ చిత్రంలోకి సాదరంగా ఆహ్వానిస్తున్నట్లు చిత్రబృందం ప్రత్యేక ప్రచార చిత్రాన్ని విడుదల చేసింది. ఇప్పటివరకు రామ్ కనిపించిన పాత్రలకు భిన్నంగా ఈ సినిమాలో ఆయన సరికొత్త అవతారంలో కనిపించనున్నట్లు సమాచారం.

ఈ చిత్రాన్ని మానసిక సంఘర్షణలతో కూడిన యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కిస్తున్నారు. నేరం, రహస్యం, మానసిక ఉద్వేగాల నేపథ్యంలో కథ సాగనున్నట్లు తెలుస్తోంది. కథలోని ఉత్కంఠ భరిత అంశాలతో పాటు భారీ పోరాట సన్నివేశాలకు కూడా ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు సమాచారం.

ఈ నెల 17న ఎన్ఎస్ఈ ఐపీఓ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 12 (తెలంగాణ ముచ్చట్లు): దేశంలో అతిపెద్ద ఈక్విటీ ట్రేడింగ్ వేదిక అయిన నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) తొలిసారిగా ప్రజల నుంచి పెట్టుబడులు సమీకరించేందుకు సిద్ధమైంది. ఎన్ఎస్ఈ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) ఈ నెల 17న ప్రారంభమై 21న ముగియనుంది. ఒక్కో షేరుకు రూ.1,700 నుంచి రూ.1,785 వరకు ధరల శ్రేణిని నిర్ణయించారు. ఈ ధరల ప్రకారం ఎన్ఎస్ఈ రూ.21,494 కోట్ల నుంచి గరిష్ఠంగా రూ.22,569 కోట్ల వరకు సమీకరించే అవకాశం ఉంది.

రెండో అతిపెద్ద ఐపీఓగా..

ఈ ఐపీఓ 2024లో జరిగిన రూ.27,870 కోట్ల హ్యుందాయ్ మోటార్ ఇండియా ఐపీఓ తర్వాత దేశంలో రెండో అతిపెద్ద ప్రజా వాటా విక్రయంగా నిలవనుంది. 2022లో జరిగిన రూ.21,000 కోట్ల ఎల్ఐసీ ఐపీఓ కంటే కూడా ఎన్ఎస్ఈ సమీకరణ మొత్తం ఎక్కువగా ఉండనుంది. ఐపీఓ ప్రక్రియ పూర్తయిన అనంతరం ఈ నెల 24న ఎన్ఎస్ఈ షేర్లు మార్కెట్లో నమోదుకానున్నాయి.

15 శాతం తగ్గిన విక్రయ పరిమాణం

ఎన్ఎస్ఈ ఐపీఓ పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ విధానంలో జరగనుంది. ప్రస్తుత వాటాదారులు మొత్తం 12.64 కోట్ల షేర్లను విక్రయించనున్నారు. తొలుత సమర్పించిన ముసాయిదా పత్రాల్లో 14.9 కోట్ల షేర్ల విక్రయాన్ని ప్రతిపాదించడంతో పాటు, ఒక్కో షేరుకు రూ.2,000-2,100 ధరను అంచనా వేశారు. ఆ ప్రకారం సుమారు రూ.30,000 కోట్ల వరకు సమీకరించే అవకాశం ఉండేది. అయితే తుది పత్రాల్లో కొందరు వాటాదారులు తమ విక్రయ పరిమాణాన్ని 15 శాతం తగ్గించుకోవడంతో ఐపీఓ పరిమాణం కూడా తగ్గింది.

ఈ ఐపీఓలో భాగంగా అర్హత ఉన్న ఎన్ఎస్ఈ ఉద్యోగుల కోసం రూ.70 కోట్ల విలువైన షేర్లను ప్రత్యేకంగా కేటాయించారు. అలాగే ఉద్యోగులకు ఒక్కో షేరుపై రూ.170 రాయితీ ఇవ్వనున్నట్లు సంస్థ ప్రకటించింది. ఆఫర్ ఫర్ సేల్ కావడంతో ఐపీఓ ద్వారా సమీకరించే మొత్తం నిధులు ఎన్ఎస్ఈకి కాకుండా వాటాలను విక్రయిస్తున్న ప్రస్తుత వాటాదారులకే చేరనున్నాయి.

మైక్రోసాఫ్ట్‌కు ఫ్రాంక్ షా గుడ్‌బై

లాస్ ఏంజిల్స్, సెప్టెంబరు 12 (తెలంగాణ ముచ్చట్లు): మైక్రోసాఫ్ట్‌లో దాదాపు మూడు దశాబ్దాలుగా సేవలందించిన చీఫ్ కమ్యూనికేషన్స్ ఆఫీసర్ ఫ్రాంక్ షా తన ఉద్యోగానికి వీడ్కోలు పలకనున్నారు. ఈ విషయాన్ని ఆయన ఉద్యోగులకు పంపిన అంతర్గత సందేశం ద్వారా వెల్లడించారు. అలాగే లింక్డిన్‌లోనూ తన నిర్ణయాన్ని పంచుకున్నారు. ఉద్యోగానికి స్వస్తి పలికి జీవితంలో కొత్త అన్వేషణను ప్రారంభించాలనుకుంటున్నట్లు తెలిపారు.

29 ఏళ్ల సుదీర్ఘ సేవ

ఫ్రాంక్ షా 29 ఏళ్లుగా మైక్రోసాఫ్ట్‌లో వివిధ హోదాల్లో పనిచేశారు. అంతకుముందు సంస్థకు చెందిన ప్రజా సంబంధాల సంస్థ వాగ్నర్ ఎడ్‌స్ట్రామ్‌లోనూ కొంతకాలం పనిచేశారు. అనంతరం మైక్రోసాఫ్ట్‌లో కీలక బాధ్యతలు చేపట్టారు. గత 17 ఏళ్లుగా సంస్థ చీఫ్ కమ్యూనికేషన్స్ ఆఫీసర్‌గా కొనసాగుతున్నారు.

చివరి వరకు కొనసాగింపు

ఫ్రాంక్ షా ఈ ఏడాది చివరి వరకు తన బాధ్యతల్లో కొనసాగనున్నారు. అయితే ఆయన స్థానంలో ఎవరు బాధ్యతలు చేపట్టనున్నారనే విషయాన్ని మాత్రం వెల్లడించలేదు. 1997లో మైక్రోసాఫ్ట్‌లో వ్యూహాత్మక సందేశాల విభాగంలో పనిచేయడం ప్రారంభించిన ఆయన.. విండోస్ ఉత్పత్తుల విడుదల సమయంలో సంస్థ ప్రజా సంబంధాల వ్యూహాలను రూపొందించడంలో కీలక పాత్ర పోషించారు.

సహచరులకు కృతజ్ఞతలు

తన నిర్ణయాన్ని సంస్థ మార్కెటింగ్ చీఫ్ తకేషితోనూ పంచుకున్నట్లు ఫ్రాంక్ షా తెలిపారు. మైక్రోసాఫ్ట్ కమ్యూనికేషన్స్ బృందంలో ప్రతిభావంతులైన ఎంతోమంది ఉద్యోగులతో కలిసి పనిచేసే అవకాశం లభించిందని పేర్కొన్నారు. దాదాపు మూడు దశాబ్దాలపాటు సంస్థలో పనిచేసిన అనంతరం కొత్త దశను ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar,
Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in